రంజాన్ వేళలు



	ఇఫ్తార్ (గురువారం సాయంత్రం)	సెహరీ (శుక్రవారం ఉదయం)
కడప	6.29	5.12
ప్రొద్దుటూరు	6.30	5.16



రక్తమోడిన రోడ్లు

జిల్లాలో రహదారులు బుధవారం రక్తమోడాయి. వేర్వేరుచోట్ల జరిగిన మూడు ప్రమాదాల్లో ఐదుగురు మృతిచెందారు. గువ్వలచెరువు ఘాట్‌లో లారీ అదుపు తప్పి లోయలో పడ్డంతో ముగ్గురు మృతిచెందగా.. దువ్వూరు మండలంలో ద్విచక్రవాహనంలో వెళుతూ ప్రమాదానికి గురై ఇద్దరు చనిపోయారు. కొండాపురం మండలంలో ఎద్దులబండిని లారీ ఢీకొనడంతో ఎద్దుతో పాటు ఓ మహిళ మృత్యువాతపడ్డారు.

లోయలో పడి నుజ్జునుజ్జు అయిన లారీ



మృతిచెందిన డ్రైవర్ సాంబయ్య

గువ్వలచెరువు ఘాట్‌లో..

సీకేదిన్నె, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కడప రాయచోటి జాతీయ రహదారిలోని గువ్వలచెరువు ఘాట్‌లో లారీ అదుపు తప్పి లోయలో పడడంతో ముగ్గురు మృతిచెందారు. పోలీసుల కథనం మేరకు.. గుంటూరు జిల్లా నర్సరావుపేటకు చెందిన అశోక్ అనే లారీ యజమాని వద్ద చిలకలూరిపేటకు చెందిన సాంబయ్య (46) డ్రైవర్‌గా, నాగరాజు (44) క్లీనర్‌గా పనిచేస్తున్నారు. వీరిద్దరూ చేపల దాణా తీసుకుని బెంగళూరు నుంచి ఏలూరుకు లారీలో బయలుదేరారు. మార్గమధ్యంలో గువ్వలచెరువు వద్ద చక్రాయపేట మండలానికి చెందిన కొవ్వూరు వివేకానందరెడ్డి(38) అనే వ్యక్తి కడపకు వచ్చేందుకు ఈ లారీ ఎక్కాడు. లారీ గువ్వలచెరువు ఘాట్ దిగుతూ నాలుగవ మలుపు వద్ద అదుపు తప్పి దాదాపు 50 అడుగుల లోయలో పడి నుజ్జునుజ్జు అయిపోయింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సాంబయ్య, క్లీనర్ నాగరాజు అక్కడికక్కడే చనిపోగా వివేకానందరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడకు చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బందిని రప్పించి క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన వారిని గ్యాస్‌కట్టర్లతో క్యాబిన్‌ను కట్ చేసి బయటకు తీశారు. అప్పటికి కొనప్రాణంతో ఉన్న వివేకానందరెడ్డిని కడప రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. అనంతరం అంబులెన్స్ తెప్పించి డ్రైవర్, క్లీనర్ మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు సీకేదిన్నె పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గువ్వలచెరువు ఘాట్ ప్రమాదంలో మృతిచెందిన వివేకానందరెడ్డి

ఎద్దుల బండిని లారీ ఢీకొనడంతో..





సంఘటన స్థలంలో మృతి చెందిన మహిళ, ఎద్దు, నారాయణమ్మ (ఫైల్‌ఫొటో)

కొండాపురం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) మండలంలోని ఏటూరు గ్రామం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళతో పాటు ఎద్దు మృతి చెందింది. ఏటూరు గ్రామానికి చెందిన రాఘవరెడ్డి, నారాయణమ్మ దంపతులు ఎద్దులబండిలో పొలం పనులకు వెళుతుండగా ఎదురుగా వచ్చిన లారీ ఢీకొంది. ఈ సంఘటనలో ఎద్దుతో పాటు నారాయణమ్మ(50) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడ్డ రాఘవరెడ్డిని 108 వాహనంలో తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్సై హృషికేశ్వర్‌రెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైకులో వెళుతూ..



ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తులు

దువ్వూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం ఘోరీస్వామి దర్గా సమీపంలో ఆనకట్ట వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. సమీప ఆనకట్ట వద్ద బైకులో దువ్వూరుకు వస్తున్న జి.సుబ్బరాయుడు (64), పి.నరసింహులు (33) మృతిచెందారు. అయితే ప్రమాదం ఎలా జరిగిందనే విషయం తెలియరాలేదు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మొదట వీరు ఎవరు అనే విషయంపై ఆరా తీశారు. చాపాడు మండలానికి చెందిన నరసింహులు, పెద్దజొన్నవరంకు చెందిన సుబ్బరాయుడుగా గుర్తించారు. అనారోగ్యంతో ఉన్న సుబ్బరాయుడిని ఆస్పత్రిలో చూపించేందుకు బైకులో తీసుకెళుతుండగా ప్రమాదం చోటు చేసుకుందని వారి బంధువులు తెలిపారు. బైకు అదుపు తప్పి బోల్తా పడ్డారా లేక ఏదైనా వాహనం ఢీకొట్టి వెళ్లిపోయిందా అనేదానిపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

జీవో 117 ఉపసంహరణతో నాణ్యమైన విద్య

● కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



మాట్లాడుతున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, చిత్రంలో డీఈవో షంషుద్దీన్

కడప కలెక్టరేట్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో భాగంగా ప్రభుత్వం జీవోనెంబరు 117ను ఉపసంహరించుకోనుందని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జీవో 117 ఉపసంహరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సన్నాహక మార్గదర్శకాలపై క్షేత్రస్థాయిలో అభిప్రాయ సేకరణ, నివేదికల సమర్పణ తదితర అంశాలపై విద్యాశాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జీవో 117ను ఉపసంహరించిన తరువాత అందుకు ప్రత్యామ్నాయంగా తీసుకొచ్చేందుకు అవసరమైన ప్రక్రియను పాఠశాల విద్యాశాఖ ప్రారంభించిందన్నారు. ఇప్పటికే సన్నాహక మార్గదర్శకాలపై ఉత్తర్వులు విడుదల చేసిందన్నారు. గత ప్రభుత్వంలో ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసిన 3, 4, 5 తరగతులను తిరిగి ప్రాథమిక పాఠశాలలకు వెనక్కి తీసుకుంటారన్నారు. విలువలతో కూడిన గుణాత్మక విద్యను అందించే ఉద్దేశ్యంతో ప్రభుత్వం జీవో 117ను ఉపసంహరించే యోచనలో ఉందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి షంషుద్దీన్, మండల విద్యాశాఖాధికారులు, మండల ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

సంతృప్తి స్థాయిలో వైద్య సేవలందించాలి

వైద్యాధికారులు, అనుబంధ శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు సంతృప్తి స్థాయిలో వైద్య సేవలందించాలని కలెక్టర్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆరోగ్యశ్రీ, అనుబంధ ఆసు పత్రులు, పట్టణ గ్రామీణ ఆరోగ్య కేంద్రాల వైద్యులతో ఆరోగ్య సూచికలు, వైద్యశాఖ కార్యక్రమాలపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓపీ, ఐపీ ల్యాబ్ టెస్టులు, డెలివరీ వంటి ఆరోగ్య సేవల్లో ఏ గ్రేడ్ సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ర్యాంకింగ్‌లో జిల్లా రెండో స్థానంలో నిలిచిందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్నిరకాల వైద్యసేవలు అందు బాటులో ఉన్నాయన్నారు.

పార్లమెంట్‌లో ప్రసంగించే అవకాశం కోసం..

యువతకు ఉపన్యాస పోటీలు



కడప మారుతీనగర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ నేషనల్ యూత్ పార్లమెంట్ ఫెస్టివల్-2025 అనే కార్యక్రమంలో భాగంగా పార్లమెంట్‌లో ప్రసంగించే అవకాశం కోసం యువతీ, యువకులకు ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి కె.మణికంఠ పేర్కొన్నారు. బుధవారం స్థానిక బాలాజీనగర్‌లోని నెహ్రూ యువకేంద్రంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 15వ తేదీ శనివారం కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో ఫిజికల్ మోడ్‌లో ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన 18 నుంచి 25 సంవత్సరాల మధ్య వయస్సుగల యువత ఈ పోటీలలో పాల్గొనవచ్చన్నారు. ప్రధానంగా ఒన్ నేషన్-వన్ ఎలక్షన్ అనే అంశంపై ఉపన్యాస పోటీలుంటాయన్నారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన విజేతలకు రాష్ట్ర స్థాయిలో అక్కడ గెలుపొందిన వారికి దేశ స్థాయి పోటీలుంటాయన్నారు. రాష్ట్ర స్థాయి, దేశ స్థాయిలో విజేతలకు నగదు బహుమతులుంటాయన్నారు. జిల్లాలోని యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇదిలావుండగా పోటీలలో పాల్గొనదలచిన వారు తొలుత మై భారత్ పోర్టల్‌లో రిజిస్టర్ చేయాలన్నారు. ఏదేని ఇతర వివరాల కోసం 9177616677 అనే నెంబర్‌తో పాటు కేఎస్ఆర్ఎం కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ లక్ష్మయ్యను సంప్రదించాలని సూచించారు.

కడప-రేణిగుంట హైవే

● ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

పనులు ప్రారంభించండి



పులివెందుల /వేంపల్లె, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కడప-రేణిగుంట గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం శాసన మండలిలో ఆయన మాట్లాడుతూ రెండేళ్ల క్రితం 130 కి.మీ మేర కడప-రేణిగుంట రోడ్డుకు రూ.2,299 కోట్లతో పనులు మంజూరయ్యాయని, 30 కి.మీ మేర రిజర్వు ఫారెస్టు అనుమతి కోసం వేచి ఉండడంవల్ల పనులు ముందుకు సాగలేదన్నారు. అటవీ మినహా 90కి.మీ రోడ్డును వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఆ శాఖ మంత్రి బీసీ జనార్దన్ మాట్లాడుతూ గత ప్రభుత్వం వల్ల రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని, కేంద్రం దృష్టికి తీసుకెళ్లి పనులు ప్రారంభమయ్యేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.


ఆడుదాం ఆంధ్రాలో వైసీపీ దోపిడీ

వైసీపీ అధికారంలో ఉండగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రాలో కూడా దోపిడీ చేసిందని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేయాలని ఆయన కోరారు. దీనికి క్రీడా, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి స్పందిస్తూ 45 రోజుల్లోపు విచారణ చేసి నిజానిజాలు నిగ్గుతేలుస్తామన్నారు. దోషులను తప్పకుండా శిక్షిస్తామన్నారు.

హాస్టల్, మెస్ మూసివేత

● కళాశాల గేట్లు మూసేసిన విద్యార్థులు

● ఉద్రిక్తతకు దారితీసిన నిరసన



విద్యార్థులతో చర్చిస్తున్న అధికారులు

ప్రొద్దుటూరు రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఉపకార వేతనాలు పెంచాలని పశువైద్య కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరసన బుధవారం ఉద్రిక్తతకు దారితీసింది. పశువైద్య కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరవధిక ఆందోళన బుధవారానికి 31వ రోజుకు చేరింది. అయితే తిరుపతి వెటర్నరీ విశ్వవిద్యాలయం వీసీ ఆదేశాల మేర కు స్థానిక వెటర్నరీ కళాశాలలోని హాస్టల్, మెస్‌ను ఉదయం మూసివేశారు. దీంతో సుమారు 200 మంది విద్యార్థులు అల్పాహారం చేయలేదు. వీరు మెయిన్‌గేట్లను మూసివేసి బైఠాయించారు. 11 గంటల ప్రాంతంలో రూరల్ పోలీసు స్టేషన్ సీఐ మద్దిలేటి, ఎస్ఐ వెంకటసురేశ్, సిబ్బందితో కలిసి కళాశాల వద్దకు చేరుకున్నారు. అసోసియేట్ డీన్ శ్రీనివాసప్రసాద్‌తో కలిసి విద్యార్థులతో చర్చించి రెండు ప్రధాన గేట్లను ఓపెన్ చేయించారు. సిబ్బంది విధులకు హాజరుకాగా విద్యార్థులు దీక్షా శిబిరంలో కూర్చొని నిరసన కొనసాగించారు. మధ్యాహ్నం నాలుగవ సంవత్సరం విద్యార్థులు హాస్టల్‌ను ఓపెన్ చేయాలని డీన్‌కు వినతిపత్రం అందించారు.

పైసలిస్తేనే వైద్యం..!

● సర్వజన ఆసుపత్రిలో వైద్య సిబ్బంది చేతివాటం

● ప్రతి సేవకు రోగులు చేయి తడపాల్సిందే

● చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు





కడప సెవెన్ రోడ్స్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కడప నగర శివారులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో ప్రతిరోజూ ఓపీ 1200 నుంచి 1500 వరకు కొనసాగుతోంది. వైద్యం కోసం వచ్చే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. రోగుల సంఖ్య పెరుగుతుండడంతో వైద్య సేవల పరిస్థితి పక్కన పెడితే... వైద్య సిబ్బంది జేబులు మాత్రం నిండుతున్నాయి. ప్రతి వైద్య సేవకు ఒక రేటు కట్టి రోగుల నుంచి బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నారు. డబ్బులు ఇవ్వకుంటే సర్వీస్ ఇవ్వకుండా రోగులను ఇబ్బంది పెడుతున్నారు. ఇది ఎంతలా మారిందంటే.. రోగిని స్కానింగ్‌కు తీసుకెళ్లాలన్నా డబ్బే, వీల్ చైర్ కావాలన్నా డబ్బే, డైపర్ లాంటివి మార్చాలన్నా డబ్బే. చివరకు రిపోర్టులు తెచ్చివ్వాలన్నా డబ్బులు ఇవ్వాల్సిందే. దీంతో ఇక్కడ వైద్యంకోసం వచ్చే పేదరోగులు అవస్థలు పడుతున్నారు.

● కాన్పుల వార్డులో దేనికెంత అనేది ఫిక్స్ చేశారు. మగపిల్లాడు పుడితే రూ.1000, ఆడపిల్ల పుడితే రూ.500 కచ్చితంగా ఇవ్వాల్సిందే. లేదంటే వారికి వైద్యసేవలు కట్. ఇవన్నీ ఆసుపత్రి అధికారులకు తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినపడుతున్నాయి.

● సాధారణంగా కాన్పులకు వచ్చేవారు కనీసం మూడు నుంచి వారంరోజులు ఆసుపత్రిలో ఉండాల్సి వస్తుంది. వైద్య సిబ్బంది వసూళ్లను ఎవరైనా ప్రశ్నిస్తే.. వారిని సిబ్బంది మొత్తం వెలేసినట్లు సేవలను పూర్తిగా నిలిపివేస్తారు. అధికారులకు ఫిర్యాదు చేస్తే మరింత ఇబ్బందులకు గురిచేస్తారనే భయంతో రోగులు మిన్నకుండి పోతున్నారు.

● ఐసీయూలో అయితే ఈ వసూళ్లు మరింత అధ్వాన్నం. చాలా వరకు ఐసీయూలో కదలలేని వాళ్లు, తీవ్రమైన జబ్బులతో ఉండేవారుంటారు. వారిని ఏదైనా స్కానింగ్‌లకు తీసుకెళ్లాలన్నా, వాష్‌రూమ్‌లకు తీసుకెళ్లాలన్నా, బట్టలు మార్చాలన్నా రూ.50 నుంచి రూ.100 ఇవ్వాల్సిందే. ఎవరైనా డబ్బులు ఇవ్వమని చెబితే బహిరంగంగానే వారితో అసభ్యంగా మాట్లాడి కించపరుస్తున్నారు. రూ.100, రూ.200 ఇవ్వడానికి గతి లేదా? ప్రైవేటు ఆసుపత్రికి వెళ్తే వేలకు వేలు వసూలు చేస్తారు. మాకు ఈ మాత్రం ఇవ్వలేరా అటు రోగులతో వాదనకు దిగుతుంటారు.

● చావు వ్యవహారంలోనూ అక్రమ వసూళ్లు ఆగడం లేదు. చికిత్స పొందే రోగి మరణిస్తే వారి బంధువులు మృతదేహాన్ని త్వరగా తీసుకెళ్లేందుకు కూడా డబ్బులు ఇవ్వాల్సి వస్తోంది. వార్డుల నుంచి స్ట్రెచర్‌లో అంబులెన్స్‌ల వద్దకు తీసుకెళ్లడానికి డబ్బులు వసూలు చేస్తున్నారు. పేదలకు ఉచిత వైద్యం అందడం లేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి విషయాలపై అధికారులు గట్టిచర్యలు తీసుకుని తమకు ఇబ్బంది లేకుండా చేయాలని రోగులు కోరుతున్నారు.

డబ్బులు తీసుకుంటే చర్యలు తప్పవు



కిందిస్థాయి ఉద్యోగులు డబ్బుల వసూళ్లపై నిఘా ఉంచాం. ఇప్పటికే ఇద్దరు సెక్యూరిటీ, ఇద్దరు శానిటేషన్ సిబ్బంది, ఒక ఎఫ్ఎన్‌ఓ మీద చర్యలు తీసుకున్నాం. ఎవరినీ ఉపేక్షించం. రోగులు ధైర్యంగా ఫిర్యాదు చేయవచ్చు. కచ్చితగా చర్యలు ఉంటాయి. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు పూర్తిగా ఉచితం. ఎవరు ఎవరికీ ఒక రూపాయి కూడా ఇవ్వాల్సిన పనిలేదు. డబ్బులు ఎవరైనా అడిగితే సీఎస్ఆర్ఎంఓకు ఫిర్యాదు చేయడం

- డాక్టర్ శ్రీనివాసులు, సీఎస్ఆర్ఎంఓ, సర్వజన ఆసుపత్రి కడప

కాసుల వేటలో.. అనంత లోకాలకు..

గల్ఫ్‌లో ఎంత పెట్రోలు ఉందో.. అన్ని కన్నీళ్లూ ఉంటాయేమో? తమ కుటుంబాల్లో సంతోషం నింపడం కోసం.. అక్కడి ఎడారుల్లో నానా కష్టాలు అనుభవించేవాళ్లు ఎందరో.. ఉపాధి దొరకక.. దొరికినా నిబంధనలు అతిక్రమించి పనిచేయాల్సి రావడంతో శిక్షలు, ప్రమాదాలు, అనారోగ్యం బారిన పడి అసువులు కోల్పోతున్నారు. చివరికి ఆ మృతదేహం స్వదేశానికి తీసుకుని వచ్చేందుకు వారి కుటుంబ సభ్యులు పలు సమస్యలు ఎదుర్కోవడంతోపాటు భారీగా డబ్బు కూడా ఖర్చు చేయాల్సి వస్తోంది. జిల్లా నుంచి అరబ్ దేశాలకు వలస వెళుతున్న వారిలో పలువురి జీవితాలు దాదాపుగా ఇలాగే ఉంటున్నాయి.



- జన్మభూమిలో జీవనం భారమై గల్ఫ్‌కు..
- ఎడారుల్లో ఆవిరవుతున్న బతుకులు..
- నెలలు గడిచినా తిరిగిరాని మృతదేహాలు
- ప్రభుత్వం వైపు బాధిత కుటుంబాల చూపు

రైల్వేకోడూరు రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయం కలిసి రాక, సొంత ఊళ్లో పనులు లేక.. పిల్లల చదువు, కుటుంబ పోషణ కోసం చేసిన అప్పులు తీర్చుకునేందుకు ఉమ్మడి కడప జిల్లాలోని పలు గ్రామాల ప్రజలు కన్న తల్లినీ, పుట్టిన ఊరినీ వదిలి, పొట్ట చేతబట్టుకుని ఎడారి దేశాల బాట పడుతున్నారు. అక్కడ సరైన పని దొరకక, తిరిగి ఇంటికి రాలేక ఇబ్బందులు పడుతున్నారు. ఓ సారి కువైత్‌కు వెళ్లి వస్తే లైఫ్ సెటిలవుతుందని, నాలుగు రాళ్లు వెనకేసుకోవచ్చన్న ఉద్దేశంతో ఉమ్మడి కడప జిల్లాలోని కడప, రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంతాలకు చెందిన వేలాది మంది ప్రతి ఏటా కువైత్‌కు వెళుతున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే..

ఇంట్లో పనికి ఖాదీమ్ వీసా, బయట పనికి సూన్ వీసా అవసరం. కొత్తగా కువైత్‌కు వెళ్లే వారిలో అధిక శాతం డ్రైవర్లుగా, వంట మనుషులుగా ఉపాధి పొందుతుంటారు. మరి కొంతమంది ఇంట్లో వీసా తీసుకుని బయటి పనులు చేస్తుంటారు. ఖాదీమ్ వీసాపై వెళ్లాలంటే రెండు నుంచి మూడు లక్షల రూపాయలు, సూన్ వీసాపై వెళ్లాలంటే మూడు నుంచి ఐదు లక్షలు ఖర్చు చేయాల్సి వస్తుంది. అంత డబ్బు భరించలేని వారు ఖాదీమ్ వీసాలో కువైత్‌కు వెళ్లి, అక్రమంగా బయటి పనులు చేస్తుంటారు. ఇలాంటి వారు పట్టుబడితే అక్కడి ప్రభుత్వం కఠినంగా శిక్షించడంతోపాటు, మన దేశానికి పంపించేస్తుంది. శిక్షలకు గురైనవారు, ఉపాధి లభించని వారు చివరికి ప్రాణాలు సైతం కోల్పోతున్నారు. చనిపోయిన వారి బంధువులెవరైనా అక్కడ ఉంటే.. చకచకా పనులు చేసి మృతదేహాలను స్వదేశానికి పంపిస్తున్నారు. ఎవరూ లేని వారి పరిస్థితి వర్ణనాతీతం.. స్వచ్ఛంద సంస్థలు, దాతలెవరైనా సహకరిస్తే కొన్ని నెలల తర్వాతైనా ఇలాంటి వారి మృతదేహాలు స్వదేశానికి వస్తాయి. ఇటీవల రైల్వే కోడూరు నియోజకవర్గంలోని ఓబులవారిపల్లి, చిట్వేల్ మండలాలకు చెందిన పలువురు ఇలా మృతి చెందారు.

ఏపీఎన్ఆర్‌టీ సేవలు

కువైత్‌లో మృతి చెందిన తెలుగువారి మృతదేహాలను స్వదేశానికి తరలించేందుకు ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెన్స్ తెలుగు సొసైటీ కృషి చేస్తోంది. 2017లో ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ సొసైటీని ఏర్పాటు చేశారు. బాధితులకు 50 వేల రూపాయలు మంజూరు చేయడంతో పాటు, మృతదేహాలను వారి స్వగ్రామానికి తరలించేందుకు విమానాశ్రయం నుంచి అంబులెన్స్ సదుపాయం కల్పించారు. గల్ఫ్‌లో భారత రాయబార కార్యాలయంతో అనుసంధానమై సేవలు అందిస్తున్న తెలుగు సోషల్ వలంటీర్స్ మృతదేహాలను తరలించేందుకు అవసరమైన అన్ని కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. కాగా, ప్రమాదంలో మృతి చెందిన వారికి వీసా 18 ఉంటే నామినీకి కంపెనీ ఇన్సూరెన్స్ మొత్తం చెల్లిస్తుంది. గల్ఫ్‌కు వెళ్లే చాలా మందికి ఇన్సూరెన్స్‌పై అవగాహన లేకపోవడంతో ఏటేటా ఎంతోమంది అక్కడికి వెళ్లి మోసపోతున్నారు.



ఇటీవల గల్ఫ్‌లో మృతి చెందిన కొప్పల రవికుమార్ మృతదేహం

ప్రభుత్వం ఆదుకుంటుంది



వివిధ కారణాలతో గల్ఫ్‌లో మృతి చెందినవారి కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుంది. గల్ఫ్‌కు వెళ్తున్న కార్మికులకు వారి దేశంలో వీసాతోపాటు ఇన్సూరెన్స్ కల్పిస్తారు. కానీ ప్రమాదాలు జరిగినప్పుడు ఆ డబ్బు ఏమవుతోందో ఎవరికీ అర్థం కావడం లేదు. అక్కడి చట్టాలపై అవగాహన లేకపోవడంతో, చాలా కుటుంబాలు తమకు రావల సిన ఇన్సూరెన్స్ పొందలేక పోతున్నారు. ఇలాంటి వారికి రాష్ట్ర ప్రభుత్వం టీడీపీ ఎన్ఆర్ఐ విభాగం ద్వారా అవగాహన కల్పిస్తోంది. గల్ఫ్‌లో మృతిచెందిన కుటుంబాలకు ఐదు లక్షల రూపాయల పరిహారం చెల్లించనున్నట్లు ఇటీవల తెలంగాణ ప్రభుత్వం మార్గదర్శకాలను జారీచేసింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గల్ఫ్ బాధితుల కోసం ఏర్పాటు చేసిన ఏపీఎన్ఆర్‌టీ సొసైటీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నాం. గల్ఫ్‌లో ఇబ్బందులు పడుతున్న వారు తమ సమస్యలను మా దృష్టికి తీసుకొస్తే రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి వారిని అన్ని విధాలుగా ఆదుకుంటాం. చంద్రబాబు పాలనలో ఏ ఒక్కరికి అన్యాయం జరగదు.

- పంతగాని నరసింహ ప్రసాద్,
టీడీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు

మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

మదనపల్లె టౌన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక శ్రీనివాస డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి కోరారు. జేసీ ఆదర్శరాజేంద్రన్, జిల్లా అధికారులతో కలసి పోస్టర్లను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 8న శ్రీనివాస డిగ్రీ కళాశాలలో నిర్వహించే మెగా జాబ్‌మేళాకు 25 మల్టీ నేషనల్ కంపెనీల ప్రతినిధులు వస్తున్నారని, 1500మందికి ఉద్యోగావకాశాలు కల్పించ వచ్చన్నారు. టెన్త్ నుంచి పీజీ వరకు చదివిన అభ్యర్థులు ఇంటర్వ్యూలకు అర్హులన్నారు. వివరాలకు 9553202509, 9618971075 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఉపాధ్యాయులు పనితీరు మెరుగుపరుచుకోవాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈవో సుబ్రమణ్యం

గుర్రంకొండ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): విద్యా బోధన తీరు సరిగాలేదంటూ జిల్లా విద్యా శాఖ అధికారి సుబ్రమణ్యం ఉపాధ్యాయుల పై మండిపడ్డారు. బుధవారం ఆయన గుర్రంకొండ తెలుగు జడ్పీ హైస్కూల్, ఉర్దూ హైస్కూల్, కండ్రిగ ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. కండ్రిగ పాఠశాలలోని విద్యార్థులను మ్యాథ్స్, సైన్స్ అంశాలపై ప్రశ్నలు అడిగారు. సరిగా సమాధానం చెప్పకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు పని తీరు మెరుగుపరుచుకోవాలని సూచించారు. మధ్యాహ్నభోజనం తినే వారి పేర్లు మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం ఎఫ్ఏ-4 పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించి సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓ సురేంద్రబాబు, హెచ్ఎం కమ్మర్‌తాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫారంపాండ్స్‌తో కూలీలకు పని కల్పించండి



సూచనలిస్తున్న డ్వామా పీడీ వెంకటరత్నం

ములకలచెరువు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): జాబ్‌కార్డుదారులందరికీ కచ్చితంగా ఉపాధి పనులు కల్పించాలని డ్వామా పీడీ వెంకటరత్నం ఆదేశించారు. సీఎల్ఆర్‌సీ భవనంలో బుధవారం నియోజవర్గంలోని ఆరు మండలాల ఉపాధి సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రతి గ్రామ పంచాయతీలో 25కు పైగా ఫారంపాండ్స్, సేద్యపు కుంటలు తవ్వించాలన్నారు. ఈ పనులను త్వరగా పూర్తి చేస్తే రైతులకు ఎంతో ప్రయోజకంగా ఉంటుందని, పశువులకు, పక్షులకు తాగడానికి నీరుంటుదన్నారు. ఉపాధి కూలీల సంఖ్య పెంచకుంటే చర్యలు తప్పవన్నారు. రోజువారీ కూలి రూ.300 తగ్గకుండా పనులు చేయించడంతోపాటు, ప్రతి కూలీకీ 100 రోజులు పనుల కల్పనకు కృషి చేయాలన్నారు. అనంతరం మండలాల వారీగా లక్ష్యాలను నిర్దేశించారు. సమావేశంలో డ్వామా ఏపీడీ మధుబాబు, ఎంపీడీఓ హరినారాయణ, ఆరు మండలాల పీఓలు, ఉపాధి ఇంజనీర్లు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

'నాటుసారా రహిత గ్రామంగా తీర్చిదిద్దుతాం'

సంబేపల్లె, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పరకలబండ బిడికిని సారా రహిత గ్రామంగా తీర్చి దిద్దుతామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్ తెలిపారు. బుధవారం నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. నాటుసారాతో కలిగే నష్టాలు ఆర్థిక ఇబ్బందులను ప్రజలకు వివరించారు. నాటుసారా తయారీ ఒకటే జీవనోపాధి మార్గం కాదని సం పాదనకు ఎన్నో మంచి మార్గాలు ఉన్నాయని తెలియ జేశారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ హిమబిందు, తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి, ఎస్ఐ భక్తవత్సలం, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి కుళాయప్ప, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్య

గుర్రంకొండ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): అప్పులబాధ తాళలేక ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గుర్రంకొండ పంచాయతీ తల్లారివాండ్లపల్లెకు చెందిన వి.శ్రీనివాసులు(48) గొర్రెలను మేపుతూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ పోషణ కోసం అప్పులు చేశాడు. రుణం చెల్లించాలని రుణదాతల నుంచి ఒత్తిడి రావడంతో మంగళవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. బుధవారం ఉదయం మజ్జిగవారిపల్లె వద్ద పొలంలో చింతచెట్టుకు ఉరేసుకుని మృతి చెంది ఉండడాన్ని అక్కడి రైతులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు మృతదేహాన్ని వాల్మీకిపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఏఎస్ఐ నరసింహులు తెలిపారు.

చిన్నారిపై పిచ్చికుక్క దాడి



గాయపడ్డ చిన్నారి వేదశ్రీ

ములకలచెరువు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారిపై ఓ పిచ్చికుక్క దా డి చేసింది. ఎక్కడ పడితే అక్కడ కరవడంతో పరిస్థితి ఆందోళనకరం గా మారింది. గ్రామస్తుల కథనం మేరకు...ములకలచెరువు మండలం మద్దినాయనిపల్లె పంచాయతీ బిస్సయ్యగారిపల్లెకు చెందిన చంద్రశేఖర్‌రెడ్డి ఐదేళ్ల కుమార్తె వేదశ్రీ బుధవారం ఉదయం ఇంటి ముందు ఆడుకుంటుండగా పిచ్చికుక్క దాడి చేసింది. చిన్నారి కేకలు వేయడంతో కుటుంబీకులు రక్షించి చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. కళ్లపై కరవడంతో కుడి కన్ను వాచింది. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వైద్యుల సూచనల మేరకు తిరుపతి రూయాకు తరలించారు.

టిప్పర్ ఢీకొని యువకుడి దుర్మరణం



యువకుడి మృతదేహం

మదనపల్లె అర్బన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): టిప్పర్ ఢీకొని ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపిన వివరాల మేరకు మదనపల్లె పట్టణం, రెడ్డీస్ కాలనీకి చెందిన దద్దాల శశికుమార్ నాయుడు (28) బైక్‌పై పుంగనూరు నుంచి వస్తుండగా బసినికొండ పంచాయతీ వై జంక్షన్ వద్ద టిప్ప ర్ ఢీకొంది. దీంతో ఆ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు తాలూకా పోలీసులు మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇంజనీరింగ్ పూర్తి చేసి ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్న ఇతని స్వగ్రామం గుర్రంకొండ మండలం, చెర్లోపల్లె పంచాయతీ కమ్మగోవిందపల్లె కాగా, మదనపల్లెలో స్థిరపడ్డారు. ఒక్కగా నొక్క కొడుకును తీసుకుపోయావా దేవుడా అంటూ తండ్రి రాజన్న విలపించాడు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు



నిందితులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు

గుర్రంకొండ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు వాల్మీకి పురం సీఐ ప్రసాద్‌బాబు తెలిపారు. ఆయన తెలి పిన వివరాల మేరకు గు ర్రంకొండ పట్టణానికి చెం దిన ఆదిల్(21), కమాల్‌ఖాన్(26), రెడ్డికుమార్(20)లు గంజాయికి బానిసలు కావడంతోపాటు దానిని విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు నిందితులపై రెక్కీ నిర్వహించారు. గుర్రంకొండ మార్కెట్ యార్డు వద్ద బుధవారం వారిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా, ఒక కిలో గంజాయి పట్టుబడింది. దీంతోపాటు రెండు సెల్ ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసు నమోదు చేసి వాల్మీకి పురం కోర్టులో హాజరుపరిచనట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ మధురామచంద్రుడు సిబ్బంది పాల్గొన్నారు.

పార్వేట ఉత్సవం ఘటనపై ఇరువర్గాలతో చర్చించాం

- మీడియాతో కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



మీడియాతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

రాయచోటిటౌన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): భద్రకాళీ సమేత వీరభద్రస్వామి పార్వేట ఉత్సవం సందర్భంగా మంగళవారం సాయంత్రం పట్టణంలోని ఠాణా జంక్షన్ వద్ద చోటు చేసుకున్న సంఘటనపై ఇరువర్గాలతో చర్చించామని, గతంలో మాదిరి సఖ్యతగా నడుచుకుంటామని ఒప్పుకునట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. పార్వేట ఉత్సవం సందర్భంగా ఏర్పడిన ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా బుధవారం రాత్రి పట్టణంలోని స్టేట్ గెస్టుహౌస్‌లో కలెక్టర్, ఎస్పీ, మంత్రి సోదరుడు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి ముస్లిం పెద్దలు, హిందూ సంఘాల పెద్దలతో విడివిడిగా చర్చలు జరిపారు. సుమారు రెండు గంటల చర్చల అనంతరం ఇరువర్గాలవారు అటు ముస్లిం సంప్రదాయాలను, ఇటు హిందూ సంప్రదాయాలను గౌరవిస్తామని, ఎవరి ఊరేగింపులు జరిగినా సమస్యలు సృష్టించమని అంగీకరించడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. భవిష్యత్తులో జరగబోయే కార్యక్రమాల విషయంలో కలెక్టర్, ఎస్పీ, తహసీల్దార్‌తో పాటు ఇరువర్గాలకు చెందిన శాంతికమిటీ సభ్యులతో కలిసి చేపట్టబోయే కార్యక్రమాల రూటు మ్యాప్ నిర్ణయించి రాయచోటి పట్టణంలో ప్రశాంతత నెలకొనేందుకు కృషి చేస్తామన్నారు. అనవసర సమస్యలు సృష్టించకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఇరువర్గాలపై ఉందని సూచించారు. ఈ సంఘటనకు సంబంధించిన ఒకవర్గం నుంచి 11మందిని, మరో వర్గం నుంచి 13మందిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరుపెట్టినట్లు తెలిపారు. భవిష్యత్తులో సున్నితమైన సమస్యలపై గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పెన్షన్‌లో 50 శాతం కోత

- భూసేకరణలో అక్రమాల పర్యవసానం
- దుర్వినియోగమైన రూ.14.50 లక్షలు రికవరీ
- 18 ఏళ్లుగా పెండింగులో వున్న కేసు పరిష్కారం

కలికిరి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి పెండింగులో వున్న కేసులను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుంటోంది. కడప జిల్లాలో వైఎస్సార్ హయాం నుంచి జరిగిన అవినీతి కేసులను పరిష్కరించడానికి ప్రభుత్వం ప్రాధాన్యమి స్తోంది. తాజాగా ఉమ్మడి కడప జిల్లాలోని పొత్తపి గ్రామంలో భూసేకరణ సందర్భంగా జరిగిన అక్రమా లకు అప్పటి భూసేకరణ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జి.సాయినాథ్‌ను (ప్రస్తుతం రిటైరయ్యారు) బాధ్యుడుగా తేల్చి, ఆయన పెన్షన్‌లో 50 శాతం శాశ్వతంగా కోత విధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దుర్వినియోగమైన రూ.14,42,826లను రికవరీ చేయాలని ఆదేశించింది. నందలూరు మండలం పొత్తపి గ్రామ రైతులకు పరిహారం చెల్లించే వ్యవహారంలో అప్పటి నెల్లూరు టీజీపీ భూసేకరణ అధికారి సాయినాథ్ భారీగా అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించారు. ఆయన నుంచి సంజాయిషీ కోరుతూ ప్రభుత్వం 2007 ఏప్రిల్ 12న నోటీసులు జారీ చేయగా, జూలై 23న సాయినాథ్ వివరణ ఇచ్చుకున్నారు. అయితే ఆయన సమాధానంలో సహేతుకత లేకపోవడంతో 2007 సెప్టెంబరు 26న పూర్తి స్థాయి విచారణకు ఆదేశించారు. అప్పటి ఉమ్మడి కడప జిల్లా జాయింట్ కలెక్టరును విచారణాధికారిగా నియమించారు. 2010 అక్టోబరు 6న జాయింట్ కలెక్టరు నివేదిక సమర్పించారు. సాయినాథ్‌పై నమోదయిన అభియోగాలన్నిటికీ ఆధారాలున్నట్లు తేల్చారు. ఈ విచారణ నివేదికపై సంజాయిషీకి అవకాశమిచ్చారు. దీంతో సాయినాథ్ 2022 జూన్ 1న తన వాదన వినిపించారు. ఈ వాదనలు కూడా తిరస్కరించిన ప్రభుత్వం ఆయనపై తీసుకోబోతున్న తుది చర్యలను తెలుపుతూ 2022 సెప్టెంబరు 5న చివరి నోటీసు జారీ చేసింది. 2022 నవంబరు 9న సాయినాథ్ కూడా తన తుది వాదనలతో కూడిన సంజాయిషీని ప్రభుత్వానికి సమర్పించారు. అంతే అంతటితో ఈ కేసు మరుగున పడింది. తాజాగా ప్రభుత్వం ఈ కేసును పరిశీలించి అక్రమాలకు బాధ్యుడుగా నిర్ధారించిన సాయినాథ్ పెన్షన్‌లో 50 శాతం మొత్తాన్ని శాశ్వతంగా కోత విధించింది. దుర్వినియోగమైన రూ.14,42,826లను కూడా ఆయన నుంచి రికవరీ చేయాలని ఆదేశిస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఆర్.పి.శిశోడియా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పుట్టి ముంచిన నకిలీ విత్తనం

- రూ. లక్షల్లో నష్టపోయిన రైతు
- పైరు పరిశీలించిన ఏడీఏ శివశంకర్
- ఉన్నతాధికారులకు నివేదిస్తామని హామీ



మిరపపైరును పరిశీలిస్తున్న వ్యవసాయ, హార్టికల్చర్ అధికారులు

బి.కొత్తకోట, మార్చి 5(ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలను కొని మోసపోయానంటూ ఓ రైతు ఫిర్యాదు చేయడం తో వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు బుధ వారం పొలాన్ని పరిశీలించారు. బి.కొత్తకోటవాసి రైతు రామాంజులు కర్ణాటక రాష్ట్రం హసన్‌కు చెందిన ఓ కంపెనీ విత్తనాలను కొనుగోలు చేసి 10 ఎకరాల్లో మి రప పైరు సాగు చేశాడు. సుమారు రూ.20 లక్షల దాకా ఖర్చు చేసినా తగిన దిగుబడి రాకపోవడంతో తనకు న్యాయం చేయాలని ముఖ్యమంత్రి చంద్ర బాబుకు ఫిర్యాదు చేశారు. దీంతో వ్యవసాయశాఖ మదనపల్లె ఉపసంచాలకుడు శివశంకర్, ఉద్యాన పరిశోధన కేంద్ర శాస్త్రవేత్త దత్తారెడ్డి, మండల వ్యవసా యాధికారి చంద్రశేఖర్ మిరప పైరును పరిశీలించారు. పంటదిగుబడి రాకపోవడం, మిరపకాయలు వంకరగా ఉండటం, తెగుళ్ల తీవ్రతపై అధ్యయనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మిరప పంట ఉద్యానశాఖ పరిధిలోకి వస్తుందని, తమ పరిధిలో తాము చేయాల్సింది చేస్తామన్నారు. తమ పరిశీలనలో తేలిన అంశాలతో రాష్ట్ర ఉద్యానశాఖ అసిస్టెంట్ డైరె క్టర్ ఆఫ్ రీసెర్చ్‌కు నివేదిక పంపుతామని, తదుపరి చర్యలు ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు ఉంటా యని ఉద్యానశాఖ శాస్త్రవేత్త వివరించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి భీమేష్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్లకే.. నూరేళ్లు..

నీటి తొట్టెలో పడి చిన్నారి మృతి



చిన్నారి జారా (ఫైల్)

బి.కొత్తకోట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఓ చిన్నా రికి నాలుగేళ్లకే నూరేళ్లు నిండిపోయాయి. బి. కొత్తకోట మండలం బడికాయలపల్లెలో బుధ వారం ఉదయం జరిగిన ఈ సంఘటన వివరాలు స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఇమ్రాన్ కొత్త ఇంటిని నిర్మిస్తున్నాడు. నిర్మాణం దాదాపుగా పూర్తి కావచ్చింది. బుధ వారం ఉదయం తన కుమార్తె జారా సిద్ధిఖా (4)తో కలిసి కొత్తఇంటి దగ్గరకు వెళ్లాడు. కుమార్తె ఆడుకుంటూ ఉండగా మరో పనిమీద పాత ఇంటి దగ్గరకు వచ్చాడు. ఆ సమయంలో ఇంటి ఆవరణ లో నిర్మించిన సంపులోకి తొంగి చూస్తున్న బాలిక ప్రమాదవశాత్తూ అందులో పడిపోయింది.

అక్కడ ఎవరూ లేకపోవడంతో నీటిలో మునిగి పో యింది. కొద్ది సేపటికి అక్కడికి వచ్చి న తండ్రి కూతురి కోసం వెతకగా నీటిలో పడి ఉండడం కనిపించింది. దీంతో బిడ్డను బయటకు తీసి హుటా హుటిన స్థానిక ఆస్పత్రికి తరలించాడు. అప్పటికే ఆ చిన్నారి మృతి చెందినట్లు వైద్యుడు ధ్రువీకరిం చాడు. దీంతో తల్లిదండ్రులు, బంధుమిత్రుల శోకానికి అవధులు లేకుండా పోయాయి.

తండ్రి మందలించాడని గొంతు కోసుకున్న యువకుడు



గొంతు కోసుకున్న యువకుడు

మదనపల్లె అర్బన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి):తండ్రి మందలించారని ఓ యువకుడు గొంతు కోసుకున్నాడు. పోలీసుల కథనం మే రకు మదనపల్లె పట్టణం, రింగ్‌రోడ్డులో కాపురం ఉంటున్న షేక్ నాసీర్ కుమారుడు షేక్ షారూక్ (30) టమోటా మార్కెట్‌లో కూలీగా పని చేస్తుంటాడు. చెడు తిరుగుళ్లు తిరుగుతూ ఉండడంతో బుధవారం తండ్రి మందలించాడు, దీంతో మనస్తాపానికి గురైన అతను కూరగాయలు కోసే కత్తితో గొంతు కోసుకున్నాడు. కుటుంబసభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

టమోటా యార్డులో మారిన వేలం విధానం



నాలుగు వరసల్లో పేర్చిన టమోట క్రేట్లను వేలం వేస్తున్న వ్యాపారులు

మదనపల్లె టౌన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మదనపల్లె టమోట మార్కెట్‌లో వేలం విధానాన్ని మండీ యజమానులు, వ్యాపారులు మార్చారు. బుధవారం స్థానిక టమోటా మార్కెట్‌లో రైతులు తీసుకొచ్చిన టమోట క్రేట్లను నాలుగు వరుసలు ఎత్తుగా పేర్చి వేలం నిర్వహించారు. రైతులే గ్రేడింగ్ చేయించుకుని రావాల్సిందిగా ట్రేడర్స్ కోరారు. దీని వలన గ్రేడింగ్ సమయం ఆదా అవుతుందని, రైతులకు కూడా మంచి ధర వచ్చే అవకాశం ఉందన్నారు. ఇకపై జాక్‌పాట్ విధానం ఉండదని మార్కెట్ కమిటీ సెక్రటరీ అభిలాష్ తెలిపారు. కార్యక్రమంలోమండీ ట్రేడర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేంద్ర, సభ్యుడు పృథ్వీ, వ్యాపారులు పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

సుండుపల్లె, మార్చి5(ఆంధ్రజ్యోతి): ఈ నెల 2వ తేదీన ప్రమాదంలో గాయపడిన రేపన అజయ్‌కుమార్ అనే వ్యక్తి తిరుపతి రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ముడుంపాడు గ్రామ పంచాయతీ కుర్వపల్లి వద్ద ఓ ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో అతను గాయపడ్డాడు.

మహిళ ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి):కడుపు నొప్పి తాళలేక పురుగుల మందు తాగి ఓ మహిళ ఆత్మహత్యాయత్నం చేసింది. ఆస్పత్రి అవుట్ పోలీసుల సమాచారం మేరకు రామసముద్రం మండలం, నారిగానిపల్లెపంచాయతీ, దిగువవారిపల్లెకు చెందిన సుబ్రమణి భార్య శ్రావణి(26)కి గర్భసంచి తొలగించాలని వైద్యులు తెలిపారు. కాగా బుధవారం కడుపు నొప్పి ఎక్కువ కావడంతో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబసభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రామసముద్రం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

9న జూడో సెలక్షన్స్

కడప స్పోర్ట్స్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) :నగర ఇండోర్ మునిసిపల్ స్టేడియంలో ఈనెల 9వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు జిల్లా జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో జూడో క్రీడాకారుల సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు ఆ అసోసియేషన్ కార్యదర్శి ఎం. నవీన్ కుమార్ తెలిపారు. ఇందులో 15 సంవత్సరాల నుంచి 21 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన జూడో క్రీడాకారులు తమ వయసు ధృవీకరణ పత్రంతో పాటు, ఆధార్‌కార్డుతో హాజరు కావాలని కోరారు.



రైతులకు అందించనున్న యూనిక్ ఐడీ కార్డు

డీకేటీ రైతులకు నమోదు ఏదీ?

- ఫార్మర్స్ రిజిస్ట్రీలో సొంతపట్టాదారులకే నమోదు
- యూనిక్ నెంబర్ కేటాయింపు ● ఆందోళనలో డీకేటీ రైతులు

వేంపల్లె, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమం కోసం వివిధ పథకాలు అమలు చేస్తున్నాయి. అన్నదాతలకు ఆ సంక్షేమ ఫలాలు అందించేందుకు ప్రస్తుతం వివిధ పద్ధతులను అవలంబిస్తున్నారు. అయితే భవిష్యత్తులో రైతులకు అందజేసే అన్నదాత సుఖీభవ నిధులు, పంటల బీమా, పీఎం కిసాన్ యోజన, సబ్సిడీ పరికరాలు, పంట నష్టపరిహారం, ఎరువుల రాయితీలు, కనీస మద్దతు తదితర వాటిని ప్రత్యేక కార్డు ద్వారా అందించేందుకు చర్యలు చేపడుతున్నారు. ఇందు కోసం అర్హులైన ప్రతి రైతుకు ఆధార్‌కార్డు తరహాలో వ్యవసాయ శాఖ ద్వారా 14 అంకెల యూనిక్ ఐడీ కేటాయిస్తున్నారు. అయితే ఇప్పటి వరకు సొంత పట్టా భూములు ఉన్న రైతుల వివరాలను మాత్రం నమోదు చేసి యూనిక్ ఐడీ నెంబర్ కేటాయిస్తున్నారు. కానీ డీకేటీ పట్టాలు ఉన్న రైతుల వివరాలు నమోదు చేయడం లేదు. ఇందుకు ఆన్‌లైన్‌లో అనుమతించడం లేదని అధికారులు చెబుతున్నారు. దీంతో డీకేటీ రైతులు తమకు పథకాలు, నిధులు అందుతాయో లేదో అని ఆందోళన చెందుతున్నారు.

సొంత పట్టాదారులకు నమోదు...

వేంపల్లె మండలంలో గత 15రోజులుగా అన్ని గ్రామాల్లో రైతులకు యూనిక్ ఐడీ నెంబర్ కేటాయింపు కోసం వ్యవసాయ శాఖ సిబ్బంది తిరుగుతున్నారు. రైతుల వద్దకే వెళ్లి వారి భూమి పాసు బుక్కు, ఆధార్‌కార్డు, ఫోన్ నెంబర్ ద్వారా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసి యూనిక్ ఐడీ కార్డుకు నెంబర్ కేటాయిస్తున్నారు. ఆయా రైతు సేవా కేంద్రాల్లో కూడా నమోదు ప్రక్రియ సాగుతోంది. మండల వ్యాప్తంగా 4100 మంది రైతులకు సంబంధించి సుమారు 14500 ఎకరాల భూమిని నమోదు చేశారు. ఇంకా 300 మంది దాకా రైతుల వివరాలు నమోదు చేయాల్సి ఉంది. కాగా, యూనిక్ ఐడి కార్డు కోసం డీకేటీ భూములున్న ఏ ఒక్క రైతు వివరాలు నమోదు చేసేందుకు ఆన్‌లైన్‌లో అనుమతి లేదు. ఒక్క వేంపల్లె మండలంలోనే 920 మంది రైతులకు సంబంధించి 2వేల ఎకరాల దాకా నమోదు కావాల్సి ఉంది. ఆ రైతులందరు యూని క్ ఐడీ కార్డు మాకు ఇవ్వరా, కార్డు ద్వారా సంక్షేమ ఫలాలు అందిస్తే.. మా పరిస్థితి ఏమిటని వ్యవసాయశాఖ అధికారులను ప్రశ్నిస్తున్నారు.



యూనిక్ ఐడి కార్డు కోసం రైతుల వివరాలు నమోదు చేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

డీకేటీలకు అనుమతి ఇవ్వలేదు

మండలంలో సొంత పట్టాదారులకు సంబంధించి యూనిక్ ఐడీ కార్డు నమోదు కోసం సుమారు 95శాతం పూర్తైంది. డీకేటీ రైతులకు సంబంధించి ఆన్‌లైన్‌లో నమోదుకు అప్రూవల్ ఇవ్వ లేదు. త్వరలోనే అనుమతి వస్తుందని ఉన్నతాధికారులు చెబు తున్నారు. డీకేటీ రైతుల వివరాలను నమోదు చేసి యూనిక్ ఐడీ నెంబర్ కేటాయిస్తాం.

-రాజేంద్రప్రసాద్,
వ్యవసాయాధికారి, వేంపల్లె.

రైతు సంఘాలకు రాయితీ రుణాలు

- ఉద్యాన శాఖ డీడీ సుభాషిణి



సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యానశాఖ డీడీ సుభాషిణి

కడప ఎన్టీఆర్ సర్కిల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రైతులు సంఘాలుగా ఏర్పడితే ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలలో 75శాతం రాయితీలు పొందవచ్చని ఉద్యానశాఖ డిప్యూటీ డైరెక్టర్ సుభషిణి తెలిపారు. రైతులు, ఉత్పత్తి దారుల సంఘాలకు బుధవారం ఉద్యానశాఖ కార్యాలయంలో అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. కార్యక్రమానికి అధ్యక్షతన వహించిన ఉద్యానశాఖ డిప్యూటీ డైరెక్టర్ సుభషిణి మాట్లాడుతూ రైతు గ్రూపుల ఏర్పాటు ఆవశ్యకత, కలిగే ప్రయోజనాలపై సమగ్రంగా వివరించారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎ.నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతులు గ్రూపులుగా ఏర్పడి ఐకమత్యంగా ఉంటే ఆర్థికాభివృద్ధిని సాధించవచ్చన్నారు. అదేవిధంగా వ్యవసాయరంగంలో కీలకపాత్ర పోషించాలన్నారు. రైతు గ్రూపులను మరింత శక్తివంతం చేయవచ్చన్నారు. లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ జనార్దన్ మాట్లాడుతూ రైతులు, ఉత్పత్తిదారుల సంఘాలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించారు. నాబార్డు డీడీఎం విజయ్‌విహారి మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారుల సంఘాల అభివృద్ధికి నాబార్డు ద్వారా సాయం అందుతుందన్నారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి జ్యోతిర్మయి, ఉద్యానశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ అధ్యాపకుడిపై కేసు

వేంపల్లె, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు ట్రిపుల్‌ఐటీలో ఫిజిక్స్ అధ్యాపకుడిగా పనిచేస్తున్న తిరుపతిరావుపై కేసు నమోదు చేసనట్లు ఆర్కేవ్యాలీ ఇన్‌చార్జి ఎస్ఐ తిరుపాల్‌నాయక్ తెలిపారు. విద్యార్థినిని అసభ్యంగా మాట్లాడినట్లు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు ఎస్ఐ తెలిపారు.

గంజాయి విక్రయాలపై ప్రత్యేక నిఘా : డీఎస్పీ

కడప క్రైం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కడప సబ్ డివిజను పరిధిలో గంజాయి విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచామని... ఎక్కడైనా విక్రయాలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలతో నిఘా ఉంచామని తెలిపారు. ఎవరైనా గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం వస్తే నేరుగా పోలీసులకు తెలియజేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మత్తు కోసం పిల్లలు ఇంజక్షన్లు కూడా వాడుతున్నట్లు సమాచారం వచ్చిందని.. అలాంటి వారిని గుర్తించి ఎడిక్షన్ సెంటరుకు పంపించి కౌన్సెలింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి విక్రయాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నామని తెలిపారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు నిఘా ఉంచాలని.. వారు ఎక్కడెక్కడ తిరుగుతున్నారు.. ఎవరితో మాట్లాడుతున్నారనే విషయంపై దృష్టి సారించాలన్నారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు బాధ్యత వహిస్తే వారు సన్మార్గంలో వెళ్లే అవకాశం ఉంటుందని సూచించారు.

యువకుడిపై దాడి... కేసు నమోదు

కడప క్రైం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఏఎస్ఆర్ నగర్ వద్ద ఓ యువకుడిపై కర్రతో దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి నట్లు తాలుకా సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఏఎస్ఆర్ నగర్‌కు చెందిన రామాంజనేయులు బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ఉదయం రోడ్డు మీద ఉండగా అక్కడే ఉన్న ఆటో డ్రైవరు ప్రశాంత్‌ల మధ్య మాటమాట పెరిగింది. దీంతో రామాంజ నేయులు తలపై కర్రతో దాడి చేయడంతో తలకు గాయమైనట్లు తెలి పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.

నేడు వైవీయూలో క్యాంపస్ డ్రైవ్

కడప ఎడ్యుకేషన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయ ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఈనెల 6వ తేదీ ఉదయం 10గం టలకు రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు వైవీయూ ప్రజా సంబంధాల విభాగ సంచాలకులు డాక్టర్ వి.సరిత ఒక ప్రకటనలో తెలిపారు. దివీస్ ల్యాబోరేటరీస్ లిమిటెడ్, శ్రీచైతన్య స్కూల్ ప్రతి నిధులు క్యాంపస్ ఎంపికలకు రానున్నారని వివరించారు. డిగ్రీ, పీజీ అర్హతలు కలిగిన విద్యార్థులు ఉద్యోగ ఎంపికలకు హాజరు కావాలని సూచించారు. కెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, తెలుగు, ఇంగ్లీష్, మ్యాథమే టిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, కంప్యూటర్స్ సోషల్ స్టడీస్ స్పెషలైజేషన్లను కలిగిన విద్యార్థులు విశ్వవిద్యాలయ నూతన పరిపాలన భవనంలోని ప్లేస్‌మెంట్ సెల్‌లో హాజరై ప్రయోజనం పొందాలని సూచించారు.

సచివాలయ ఉద్యోగి సస్పెన్షన్

బద్వేలు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని రామాంజనేయనగర్ సచివాలయం వార్డు పరిధిలోని ఓ ఉద్యోగిని తొలగించినట్లు మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి పేర్కొన్నారు. ఆయన వివరాల మేరకు.. రామాంజనేయనగర్ సచివాలయంలో వార్డు పరిపాలన కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న కోన గిరిబాబు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరయ్యారని, అలాగే ఫోన్‌లో కూడా అందుబాటులోకి రాకపోవడంపై సస్పెం డ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సర్వేలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని కమిషనర్ సూచించారు.

గండికోట ముంపువాసుల సమస్యలను పరిష్కరిస్తాం

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల



గండికోట నిర్వాసితులతో మాట్లాడుతున్న మంత్రి నిమ్మలరామనాయుడు

కొండాపురం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) గండికోట నిర్వాసితుల సమస్యలను పరిష్కరించేందుకు తక్షణమే చర్యలు చేపడతామని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామనాయుడు తెలిపారు. బుధవారం అమరావతిలోని మంత్రి కార్యాలయంలో నీటిపారుదల సెక్రటరీ సాయిప్రసాద్, ఆర్అండ్ఆర్ కమిషనర్ రామచంద్ర, ప్రభుత్వవిప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారా యణ రెడ్డి, జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి, ముంపు వాసులతో కలిసి మంత్రి సమావేశమయ్యారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ బడ్జెట్‌లో నిర్వాసితుల పరిహారం కోసం రూ.150 కోట్లు కేటయించామన్నారు. ముఖ్యమంత్రి జగన్ నిర్వాసితులకు రూ.500 కోట్ల మేర పరిహారం ఇవ్వకుండా కేవలం జీవో మాత్రమే ఇచ్చారన్నారు. అయినప్పటికీ తమ ప్రభుత్వం నిర్వాసితులకు న్యాయం చేసేందుకు కట్టుబడి ఉందన్నారు.
ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ఒకేసారి అంత మొత్తంలో పరిహారం చెల్లించేందుకు సాధ్యపడదని.. విడతల వారీగా పరిహారం చెల్లిస్తామని మంత్రి తెలిపారు. గండికోట పునరావాస కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీలు, శ్మశానవాటికలు తదితర మౌలిక సదుపాయాలను వెంటనే కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గండికోట నిర్వా సితులు పునరావాసకాలనీల్లో నిర్మించుకున్న ఇళ్లకు ఇళ్ల పట్టాల ను ఇప్పిస్తామని మంత్రి తెలిపారు. అర్హులై ఉండి కూడా పరిహా రం అందని నిర్వాసితులు 22 ముంపు గ్రామాల్లో చాలా మంది ఉన్నారని, వారికి తిరిగి సర్వే నిర్వహించి పరిహారం ఇప్పించాలని నిర్వాసితులు కోరగా మంత్రి అంగీకరించారు. గండికోట నిర్వాసితుల సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని ఎమ్మెల్యే, భూపేశ్ కోరారు. అలాగే తిమ్మాపురం చెరువు కింద ముంపునకు గురవుతున్న డొంకపల్లె గ్రామానికి పరిహారం ఇవ్వాలని మంత్రి దృష్టికి తెచ్చారు. ఇందుకు స్పందించిన మంత్రి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌తో మాట్లాడారు. కార్యక్రమంలో మండల కూటమి ఇన్‌చార్జ్ శివనారాయణరెడ్డి, గండికోట ముంపువాసులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి, గ్రావెల్ తరలింపు

- చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు
- అడ్డుకున్న గ్రామస్థులు

అట్లూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లాయపల్లె చెరువు తట్టు, ప్రభుత్వ భూముల నుంచి శనివారం నుంచి బద్వేలుకు చెందిన వైసీపీ నాయకుడు అక్రమంగా మట్టి, గ్రావెల్ తవ్వి తరలిస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. అనుమతులు లేకుండా ఎలా గ్రావెల్ తరలిస్తారని ప్రశ్నించగా.. రెవెన్యూ అధికారులకు చలానా కడుతున్నామని చెప్పారు. దీంతో గ్రామస్తులు ఆధారాలు చూపమని అడగ్గా.. వారి వద్ద ఇటువంటి ఆధారాలు లేకపో వడంతో పరారయ్యారు. మళ్లీ మంగళవారం అర్ధరాత్రి సమయంలో బయనపల్లెకు చెందిన వైసీపీ నాయకుడు టిప్పర్లతో గ్రావెల్‌ను వెంచర్లకు తరలించి లక్షల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నట్లు గ్రామస్తులు వెల్లడించారు. దీంతో గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్లను మిషనరీని అడ్డుకోవడంతో హిటాచిని వలస పాలెం గ్రామానికి తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు. దీంతో యజమాని టీడీపీ నాయకులతో గ్రామస్తులతో బేరసారాలు సాగించినట్లు సమాచారం. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడంపై గ్రామస్తులు మండి పడుతున్నారు. దీనిపై స్థానిక తహసీల్దారు సుబ్బలక్ష్మమ్మను వివరణ అడగ్గా అక్రమంగా గ్రావెల్ తరలించడంపై విచారించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



నల్లాయపల్లె ప్రభుత్వ భూమిలో గ్రావెల్ తరలిస్తున్న వాహనాలను అడ్డుకున్న గ్రామస్థులు

ఆ స్థలంలోకి ఎవరూ ప్రవేశించొద్దు

- తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి

పోరుమామిళ్ల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధిలోని 1001 సర్వే నెంబరులో 164 సెక్షన్ అమలులో ఉందని, ఆ స్థలంలోకి ఎవరూ ప్రవేశించొద్దని తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సదరు స్థలంలో ఘర్షణ జరిగిందని, అక్కడ ఎవరున్నారనే విషయాలపై బుధవారం ఆర్ఐ సుధాకర్‌రెడ్డి విచారణ జరిపారన్నారు. ఆ స్థలంలో ఎంతమంది ఉంటున్నారనే వివరాలపై ఆరా తీసి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు తిరిగి నిర్ణయం తీసుకునేంత వరకు కొత్త వ్యక్తులు ఆ స్థలంలోకి ప్రవేశించరాదని హెచ్చరికలు జారీ చేశారు.



విచారణ చేస్తున్న ఆర్ఐ సుధాకర్‌రెడ్డి బృందం

వైద్య పీజీ డిగ్రీ పరీక్షలలో టాపర్‌గా నిలిచిన కడప రిమ్స్ డాక్టర్



డాక్టర్ విరాజితను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బంది

కడప సెవెన్‌రోడ్స్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య సహస్ర విశ్వవద్యాలయం వైద్య పీజీ డిగ్రీ పరీక్షలలో రాష్ట్రస్థాయిలో అత్యధిక మార్కులు (609) సాధించి కడప రిమ్స్ కళాశాల డాక్టర్ పందల విరాజిత ఎన్టీఆర్ వైద్య యూనివర్సిటీ టాపర్‌గా నిలిచింది. విద్యార్థిని కృషి, పట్టుదల జనరల్ మెడిసిన్ అధ్యాపకుల మార్గదర్శనంతో గోల్డ్ మెడల్ సాధించినట్లు అడషనల్ డీఎంఈ రిమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ తెలిపారు. గవర్నమెంట్ మెడికల్ కాలేజీ విద్యార్థులు ఈ స్ఫూర్తితో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సదర్భంగా డాక్టర్ విరాజిత మాట్లాడుతూ ఎండోక్రైనాలజీ సూపర్‌స్పెషాలిటీ చేసి రోగులకు సేవ చేయాలని అభిలషిస్తున్నట్లు తెలిపారు. అకాడమిక్ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ విజయ భాస్కర్‌రెడ్డి, జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కేబీ యాదవేంద్రరెడ్డి, సహాయ ఆచార్యులు డాక్టర్ కిషోర్‌కుమార్, డాక్టర్ లీలా ప్రసాద్‌బాబు, డాక్టర్ విజయసింహారెడ్డి, డాక్టర్ అర్జున్ అవ్వారు, డాక్టర్ మనోహర్‌లు డాక్టర్ విరాజితకు అభినందనలు తెలిపారు.

పుట్టగొడుగుల పెంపకం.. లాభదాయకం

- కృషి విజ్ఞాన కేంద్రంలో శిక్షణ కార్యక్రమాలు
- వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కృషి

సికెదిన్నె, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పుట్టగొడుగుల పెంపకం లాభదాయకంగా ఉంటుంది. మన పని మనం చేసుకుంటూ తక్కువ ఖర్చుతో తీరిక సమయాల్లో ఇంటిలో కూర్చొని సంపాదించుకునే కుటీర పరిశ్రమగా పుట్టగొడుగుల పెంపకాన్ని చేపట్టవచ్చు. దీనిపై ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో నిరుద్యోగ యువతకు, మహిళలకు పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి.. వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తున్నారు.

పుట్టగొడుగులు... రకాలు

పుట్టగొడుగుల్లో దాదాపు రెండు వేలకుపైగా రకాలు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే మన దేశంలో ప్రధానంగా నాలుగు రకాల పుట్టగొడుగులను ఎక్కువగా పెంచుతుంటారు. అందులో వైట్ బటన్ మష్రూమ్, ముత్యపు చిప్ప పుట్టగొడుగులు, వరిగడ్డి పుట్టగొడుగులు, పాల పుట్టగొడుగులు ప్రధానమైనవి. ఇందులో మన ప్రాంతంలో ఎక్కువగా పాలపుట్టగొడుగులు, ముత్యపు చిప్ప పుట్టగొడుగులు ఎక్కువగా లభిస్తున్నట్లు, వాటికి గిరాకీ ఉన్నట్లు తెలుస్తోంది.

పుట్టగొడుగుల్లో ఔషధ గుణాలు

పుట్టగొడుగుల్లో అనేక రకాల ఔషదగుణాలు ఉన్నాయి. పుట్టగొడుగులు యాంటీబయాటిక్, యాంటీ క్యాన్సర్, హైపోలిపిడిమిక్, యాంటీహైపర్‌టెన్సన్ లాంటి జబ్బులకు ఔషధాలుగా ఉపయోగపడుతాయి. పుట్టగొడుగుల్లో వరి, గోధుమ, కూరగాయల కంటే అధికంగా ప్రొటీన్స్ ఉంటాయి. పీచుపదార్థం ఉంటుంది. పుట్టగొడుగుల్లో కొవ్వు పదార్థాలు ఉండవు. అందరికి ఎంతగానో అనుకూలంగా ఉంటుంది. పొటాషియం, సోడియం, పాస్పరస్‌లు ఎక్కువగా ఉంటాయి. విటమిన్-సి, విటమిన్-బి అధికంగా ఉంటాయి. పిండి పదార్థాలు తక్కువగా ఉండటం వలన షుగర్ వ్యాధి, గుండెజబ్బు ఉన్న వారికి ఇవి మంచి ఆహారంగా ఉపయోగపడుతాయి.

కుటీర పరిశ్రమగా....

పుట్టగొడుగుల పెంపకంను కుటీర పరిశ్రమగా ఏర్పాటు చేయడం వలన ఎక్కువ పెట్టుబడి అవసరం లేదు. కాలవ్యవధి తక్కువగా ఉంటుంది. 35 నుంచి 45 రోజుల్లో పెంచవచ్చు. ఇంటి ఆవరణలో వీటిని సులభంగా పెంచుకోవచ్చు. అధిక దిగుబడులు, ఆదాయాన్ని పొందవచ్చు. పంట అయిపోయిన తర్వాత దిండ్లను ఎరువుగా కూడా ఉపయోగించుకునే వీలుంటుంది.



శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



పుట్టగొడుగుల పెంపకంపై యువత, మహిళలకు శిక్షణ కార్యక్రమం ఇస్తున్నాం. ఈ అవకాశాన్ని గ్రామీణ యువత, మహిళలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలి. ఈ శిక్షణను ఉపాధి అవకాశాలుగా మార్చుకునేందుకు ఉపయోగపడుతుంది. ప్రతిసంవత్సరం యువతకు వివిధ రకాల శిక్షణ కార్యక్రమాలు అందిస్తుంటాము. కొందరు సొంతంగా యూనిట్లు ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందుతున్నారు.

- డాక్టర్‌వీరయ్య, కేవీకే సమన్వయకర్త

పుట్టగొడుగుల పెంపకంతో ఉపాధి



పుట్టగొడుగుల పెంపకాన్ని యువత కుటీర పరిశ్రమలా ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందవచ్చు. పుట్టగొడుగుల్లో ఎన్నో పోషక విలువలు ఉన్నాయి. ప్రస్తుతం వీటి వాడకం పెరిగింది. పుట్టగొడుగులతో కూర, తాలింపు, బిర్యానీ, పుట్టగొడుగుల చాట్, పుట్టగొడుగుల కర్రి తదితర రకాలుగా ఉపయోగించి పిల్లలకు, పెద్దలకు ఇష్టమైన విధంగా తయారు చేసుకోవచ్చు.

- శిల్పకళ, కేవీకే శాస్త్రవేత్త

ఆంధ్రజ్యోతి దినపత్రికలో బుధవారం ప్రచురితమైన చిత్రం చెప్పిన సమస్యపై కార్పొరేషన్ సిబ్బంది స్పందించారు. నాగరాజుపేట సమీపంలో మురికికాల్వపై ఉన్న పెద్దపెద్ద మొక్కలను తొలగించి శుభ్రం చేశారు.దీంతో మురుగునీరు సక్రమంగా పోతోంది. కార్పొరేషన్ సిబ్బంది స్పందనకు స్థానికులు అభినందనలు తెలిపారు.

కడప సెవెన్ రోడ్స్ (ఆంధ్రజ్యోతి)



బహుజన నగర్‌లో సమస్యల తిష్ట

సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాలువలకు నోచుకోని వైనం ● ఇప్పుడైనా తీరేనా...?

కడప(వినాయకనగర్), మార్చి5(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని 15వ డివిజన్ బహుజన నగర్‌లో సమస్యలు తిష్ఠ వేశాయి. సిమెంటు రోడ్లు లేవు. డ్రైనేజీ కాలువలు లేక మురుగునీరు రోడ్లపైకి చేరుతోంది. ఈ రోడ్లపై నడవాలంటే స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మరోపక్క మంచినీటి పైపులైన్లు పగిలి వృథాగా నీరు రోడ్లపైకి చేరుతోంది. ఇక్కడ దాదాపు 500 కుటుంబాలు నివాసముంటున్నాయి. దాదాపు 2 వేల మంది జనాభా నివసిస్తున్నారు. సమస్యలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. మౌలిక వసతులకు ఆమడ దూరంలో ఉంది. గత ప్రభుత్వంలో చాలా మంది నాయకులు, అధికారులు ఎన్నో హామీలు ఇచ్చారు. ఇంతవరకు నెరవేరలేదు. ఈ ప్రభుత్వంలోనైనా మౌలిక వసతులు కల్పిస్తారని ఎదురుచూడాల్సి వస్తోందని స్థానికులు అంటున్నారు.



సిమెంటు రోడ్లు లేని బహుజన నగర్

ప్రయాణీకుల సౌకర్యార్థం కడప ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటుచేసిన తాగునీటి ఆర్‌వో ప్లాంట్ ద్వారా అక్కడున్న కుళాయిలకు నీరు రావడం లేదు. కేవలం అలంకారప్రాయంగా ఉంది. దీంతో చాలా మంది ప్రయాణీకులు బస్టాండ్‌లో ఉన్న స్టాల్స్‌లో డబ్బులిచ్చి మినరల్ వాటర్ బాటిల్స్ కొనుగోలు చేస్తున్నారు. కొనుగోలు చేయలేని ప్రయాణీకులు అక్కడున్న తాగునీటి కుళాయిల వద్దకు చేరి అందులో నుంచి తాగునీరు రాక పోవడంతో నిరాశగా వెనుతిరుగుతున్నారు. అసలే ఎండాకాలం , ఆపసోపాలు పడుతూ వివిధ ప్రదేశాలకు వెళ్ళేందుకు బస్టాండ్‌కు చేరుకునే వృద్ధులు, పిల్లలు, మహిళలు తాగునీటి కోసం తంటాలు పడుతున్నారు.

కడప మారుతీనగర్ (ఆంధ్రజ్యోతి)



భూసమస్యల పరిష్కారమే ధ్యేయం : జేసీ

పులివెందుల టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రైతుల భూ సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ ధ్యేయమని రెవెన్యూ అధికారులతో జాయింట్ కలెక్టరు అదితిసింగ్ అన్నారు. బుధవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో నియోజక వర్గంలోని పులివెందుల, వేముల, వేంపల్లె, లింగాల, సింహాద్రిపురం, మండలాలకు చెందిన భూ సమస్యలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ కానీ భూముల అడంగల్ వన్‌బీ, మిగులు భూములకు సంబంధించి రైతుల వద్ద నుంచి అర్జీలు సమస్యలు అధికారుల దృష్టికి తీసుకురావడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ చిన్నయ్య, రెవెన్యూ స్పెషల్ ఆఫీసు మాధవ క్రిష్ణారెడ్డి, నియోజకవర్గంలోని తహసీల్దార్లు , డీటీలు, ఆర్‌ఐలు, సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.



అధికారులతో చర్చిస్తున్న జేసీ అదితిసింగ్

ప్రాంగణ ఎంపికల్లో రామిరెడ్డి కళాశాల విద్యార్థుల ప్రతిభ



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, తదితరులు

సీకేదిన్నె, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రాంగణ ఎంపికల్లో రామిరెడ్డి ఫార్మసి కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు కళాశాల ప్రిన్సిపాల్ నెల్సన్‌కుమార్ తెలిపారు. స్థానిక ప్రకృతినగర్‌లోని కళాశాలలో బుధవారం కంపెనీ ప్రతినిధులు హరికృష్ణ, ప్రవీణ్ రెండు దశల్లో ఇంటర్వ్యూలు నిర్వహించి ఉమ్మడి జిల్లాల నుంచి 250 మంది విద్యార్థులు హాజరుకాగా అందులో రామిరెడ్డి కళాశాలకు చెందినవారు 54 మంది ఉన్నారు. ఇతర కళాశాలలకు సంబంధించి 20 మంది ఎంపికయ్యారని, ఎంపికైన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ అధికారులు నరసింహారావు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

రామ్మోహన్‌రావు సేవలు మరువలేనివి

కడప మారుతీనగర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ) వ్యవస్థాపక అధ్యక్షుడు స్వర్గీయ పెండ్యాల రామ్మోహన్‌రావు సేవలు మరువలేనివని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్‌యూనియన్ నాయకులు కొనియాడారు. రామ్మోహన్‌రావు 20వ వర్ధంతిని పురస్కరించుకుని ఆర్టీసీ కడప డిపో ఎన్ఎంయూ ఆధ్వర్యంలో బుధవారం ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్రత్యేకంగా వేడుకలు నిర్వహించారు.కార్యక్రమంలో ఆర్టీసీ ఎన్ఎంయూ నాయకులు శివారెడ్డి, కడప డిపో అధ్యక్షుడు టి. జయరామ్, గ్యారేజ్ అధ్యక్షుడు రవి, కార్యదర్శి శ్రీను, పలువురు డిపో ప్రతినిధులు పాల్గొన్నారు.

ఐఈడీఎస్ఎస్ ఉపాధ్యాయులకు ప్రాధాన్యం ఇవ్వాలి

కడప ఎడ్యుకేషన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఐఈకోఆర్డినేటర్ ఖాళీ పోస్టు భర్తీ విషయంలో జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఐఈడీ ఎస్ఎస్ స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ వారికి ప్రాధాన్యత ఇవ్వాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షులు సీవీ ప్రసాద్,జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వరచంద్ర, అలీఖాన్ ఒక ప్రకటనలో కోరారు. కనిష్ట సర్వీస్ స్కూల్ అసిస్టెంట్ (స్పెషల్ ఎడ్యుకేషన్) వారికి లేని సందర్భంలో గతంలో ఐఈడీ టీచర్‌గా పనిచేసిన సర్వీసును పరిగణలోకి తీసుకోవాలని కోరారు.

ఆర్థిక సాయం

చెన్నూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరుకు చెందిన ఆటో డ్రైవరు శంకరయ్య అనారోగ్యంతో బుధవారం మృతి చెందడంతో ఆయన కుటుంబానికి టీడీపీ మండల మైనార్టీ సెల్ మాజీ అధ్యక్షుడు కరీం రూ.15వేలు ఆర్థిక సాయం అందించారు. అలాగే చాలా కాలంగా ఆటో డ్రైవరు శంకరయ్య అనారోగ్యంపాలై డయాలసిస్ చేసుకుంటుండగా పలుమార్లు తన స్నేహితునితో కలిసి ఆర్థికసాయం అందించడం జరిగింది. అంత్యక్రియలకు ఆర్థిక సాయం చేసి ముందు ఆ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటామని బాల్యమిత్రులు తెలిపారు.

నాటుసారా నిర్మూలనకే 'నవోదయం'

సీకేదిన్నె, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): నాటుసారాను పూర్తిగా నిర్మూలించే లక్ష్యంగా ప్రభుత్వం నవోదయం అనే కార్యక్రమాన్ని చేపట్టిందని చింతకొమ్మదిన్నె సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం గుర్రంగుంపు తాండాలో బుధవారం నవోదయం 2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. నాటుసారాను పూర్తిగా నిర్మూలించి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని వారిచేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తహసీల్దారు నాగేశ్వరరావు, ఎంఈవో వెంకటరామిరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, జయరాజు, చంద్రశేఖర్, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

14న చలో పిఠాపురం

వేంపల్లె, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జనసేన ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని ఈనెల 14న పిఠాపురంలో జరగనున్న సభకు తరలిరావాలని ఆ పార్టీ కార్యకర్తలకు జనసేన నేతలు పిలుపునిచ్చారు. జనసేన కడప పార్లమెంట్ పార్టీ సమన్వయకర్త తాతంశెట్టి నాగేంద్ర, జిల్లా అధ్యక్షుడు సుంకర శ్రీనివాసులు మాట్లాడారు. కాగా వేంపల్లె ఆర్‌అండ్‌బీ అతిథి భవనంలో జనసైనికుల కార్యకర్తల సమావేశం పులివెందుల సమన్వయకర్త హరీష్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ మేరకు చలో పిఠాపురం పోస్టర్లు విడుదల చేశారు. నాయకులు రవిశంకర్ తదితరులలు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామిపై చర్యలు తీసుకోవాలని క్యాంపస్ ఆర్ఎస్‌యూ నాయకులు రవిశంకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కడప నగరం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థినిపై లైంగిక వేధింపుల సంఘటన జరిగితే అండగా ఉండాల్సిన డైరెక్టర్ బాధితురాలికి వ్యతిరేకంగా కేసు నమోదు కాకుండా ప్రయత్నం చేయడం దురదృష్టకరమన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్, నగర అధ్యక్షుడు హరిబాబు పాల్గొన్నారు.

తాగునీటి కొరత లేకుండా నీటి సరఫరా

లింగాల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజలకు తాగునీటి కొరత లేకుండా చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఏడుకొండలు అన్నారు. లింగాల మండలం పార్నపల్లె సమీపంలోని చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి పులివెందుల నియోజకవర్గం ప్రజలకు తాగునీటిని అందించేందుకు ఏర్పాటుచేస్తున్న వాటర్ గ్రిడ్ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందుల, లింగాల, సింహాద్రిపురం మండలాలకు ఈనెల 20వ తేదీలోగా నీటి సరఫరా ప్రారంభించాలని ఆయన అధికారులను ఆదేశించారు. అలాగే సీబీఆర్ నుంచి కోమన్నూతల మీదుగా రాచకుంటపల్లె వరకు కూడా 20వ తేదీలోగా నీటి విడుదలను ప్రారంభించాలన్నారు. ఈఈ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడండి

వీరపునాయునిపల్లె, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలని కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కీర్తపల్లె గ్రామంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టు పరిశ్రమల శాఖ జిల్లా అధికారి శ్రీనివాసులరెడ్డి, ఏఓ శ్యామ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ పరీక్షల అక్రమాలపై విచారణ చేపట్టండి

కడప ఎడ్యుకేషన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ ఇంటర్ పరీక్షల్లో జరుగుతున్న అక్రమాలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. బుధవారం కడప నగరం డీఈఓ కార్యాలయంలో డీఈఓ షంషుద్దీన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి కొమ్మలపాటి సుబ్బరాయుడు, ఏఐఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జగదీష్, నాగరాజు, ఏఐఎస్‌యు జిల్లా కన్వీనర్ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దోమతెరల పంపిణీ

కడప మారుతీనగర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వృద్ధులకు దోమతెరలను పంపిణీ చేసినట్లు హిమ వర్షిణి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు గుండ్లకొండ విజయలక్ష్మి పేర్కొన్నారు. ఆ మేరకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం శ్రీనగర్ కాలనీలో ఉన్న కారుణ్య వృద్ధాశ్రమంలో అవ్వారు గురుకుమార్ సహకారంతో దోమతెరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ కానిస్టేబుల్ గుండ్లకొండ రవి, ప్రతినిధులు పురుషోత్తం, రెడ్డిలక్ష్మణ్, వెంకటసురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ కిట్లు..: నిరుపేద ముస్లింలు సంతోషంగా రంజాన్ పండుగ చేసుకోవాలని నగర యువ నాయకుడు జరుగు వెంకటరమణారెడ్డి (నాని) ఆకాంక్షించారు. బుధవారం కడప రవీంద్రనగర్ ప్రాంతంలోని సుమారు 160 పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ కిట్లు (నిత్యావసర వస్తువులు) పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రతినిధులు అబ్దుల్ రౌఫ్, మహ్మద్ సిద్ధిఖ్, జిలాన్ తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లె ప్రధాన రోడ్లలో మురుగు

వేంపల్లె, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణం ప్రధాన రోడ్లలో మురుగు నీరు కాల్వలు పొంగి ప్రధాన రహదారుల్లోకి ప్రవహిస్తోంది. గండిరోడ్డులో డ్రైనేజీ సరిగా లేక మురుగంతా రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. మురుగునీటిలోనే ప్రయాణించాల్సి వచ్చింది. కడప రోడ్డులోని ఎస్సీ కాలనీ వద్ద కాల్వ నిర్మాణం కోసం గుంతలు తవ్వడంతో మురుగునీరంతా రోడ్లపై ప్రవహిస్తోంది. నిత్యం వందలాది వాహనాలు వెళ్తుండడంతో రోడ్డంతా గుంతలమయం అయింది. మురుగునీరు ఇలా రోడ్లపై ప్రవహించకుండా పంచాయతీ సిబ్బంది చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



కడప రోడ్డుపై పారుతున్న మురుగు

పీజీ వైద్య విద్యలో రిమ్స్ విద్యార్థుల ప్రతిభ

కడప సెవెన్ రోడ్స్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య శాస్త్ర విశ్వవిద్యాలయం పీజీ ఫైనల్ పరీక్షల ఫలితాలలో, వివిధ విభాగాలలో రిమ్స్ విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. మెడిసిన్ 11, సర్జరీ 3, గైనకాలజీ 5,ఆర్థోపెడిక్స్, ఈఎన్‌టీ, ఆప్తమాలజీ, పీడియాట్రిక్స్ విభాగాలలో 3, అనస్థీషియాలజీలో 5, డెర్మటాలజీలో రెండుచొప్పున, మిగతా విభాగాలకు సంబంధించి మొత్తం 38 మంది విద్యార్థులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు. డాక్టర్ లావణ్య 76శాతం మార్కులుసాధించారు. డాక్టర్ విరాజిత మెడిసిన్ విభాగంలో ఏకంగా గోల్డ్‌మెడల్ సాధించారు. రిమ్స్ విద్యార్థులు మరిన్ని విజయాలు సాధించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ ఆకాంక్షించారు.

టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పీరయ్యకు ఘన నివాళి



కడప ఎర్రముక్కపల్లె, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కడప నగరం టీడీపీ ఎన్నారై కార్యాలయంలో బుధవారం టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యుడు పోతుగంటి పీరయ్యకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీరయ్య పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. కువైట్ ఎన్ఆర్ఐ రహమతుల్లా, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ, లోకేష్, శంకర్ పాల్గొన్నారు.

ఖిల్లా మసీదులో నిర్మాణాలకు బ్రేక్

పంచాయతీ అనుమతులు తప్పనిసరి : అధికారులు



నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

చెన్నూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి) : ఖిల్లా మసీదులో జరుగు తున్న నిర్మాణాలను తక్షణం నిలిపివేయాలని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అనుమతి తీసున్న తరువాతే నిర్మాణాలు చేపట్టాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి శివకుమార్ అన్నారు. స్థానిక ఖిల్లా మసీదులో జరిగే నిర్మాణాలకు ఎలాంటి అనుమతి లేదని హిందూ ఐక్యవేదిక సభ్యులు అటు రెవెన్యూ, ఇటు పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. దీంతో మంగళవారం సాయంత్రం కలెక్టరు కార్యాలయానికి ఇరువర్గాలను పిలిపించి కలెక్టరు, ఎస్పీ మాట్లాడారు. బుధవారం ఇదే విషయమై పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు అనుమతితో ఖిల్లా మసీదులో నిర్మాణాలు చేపట్టాలంటే కుదరదని అక్కడ నుంచి కుడాతో అనుమతి తీసుకుని దాని ద్వారా పంచాయతీలో అనుమతి పొంది ఆ తరువాత మాత్రమే నిర్మాణాలు చేపట్టాలన్నారు. అలాగే తూర్పువీధిలో గంగమ్మజాతర జరిగే స్థలంలో ఉన్న రోడ్డు పక్కన మిగిలిన స్థలం గ్రామ పంచాయతీకి తప్ప ఎవరికీ ఎలాంటి హక్కులేదని, అక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టే అధికారం ఎవరికీ లేదన్నారు. అలాగే బుధవారం ఆ స్థలాన్ని కూడా పరిశీలించారు.

సబ్‌జైలు ఆకస్మిక తనిఖీ

పులివెందుల టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక పులివెందుల జైలును జిల్లా సివిల్ జడ్జి షేక్ బాబాఫక్రుద్దీన్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. సబ్ జైలులోని మౌలిక వసతులను పరిశీలించారు. ఖైదీలతో ముఖాముఖిగా మాట్లాడి పరిస్థితులపై ఆరా తీశారు. నిబంధనల ప్రకారం నడుచుకోవాలన్నారు. ఖైదీల ఆరోగ్య పరిస్థితిని ఆర్థిక స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సబ్‌జైలు సూపరింటెండెంట్ అయ్యవారురెడ్డి మాట్లాడుతూ ఇక్కడున్న బార్ అసోసియేషన్ తరపున న్యాయవాదులు నెలకొకసారైనా సబ్ జైలుకు వచ్చి ఖైదీల పరిస్థితులు తెలుసుకుని వారికి న్యాయం జరిగేలా చూస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పులివెందుల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, సీనియర్ న్యాయవాదులు కరుణాకర్‌రెడ్డి,ప్యానల్‌అడ్వయిజర్ కిశోర్‌కుమార రెడ్డి, న్యాయవాది నరసింహా, న్యాయవాది గజేంద్ర పాల్గొన్నారు.

'చిన్నపనే కదా అని నిర్లక్ష్యం చేయవద్దు'

కడప నాగరాజుపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మనకు తెలిసిన పనే కదా ఇది ఒక చిన్నపనే కదా దీనికి భద్రత నియమాలు పాటించాలా అనే నిర్లక్ష్యాన్ని వీడాలని విద్యుత్ శాఖ ఎస్ఈ ఎస్.రమణ అన్నారు. బుధవారం ఎస్ఈ చాంబర్‌లో విద్యుత్ పనులు చేసేటపుడు సిబ్బంది తీసుకోవాల్సిన భద్రత సూచనలపై గోడపత్రాలు విడుదలచేశారు. ఈఈలు మధుసూదన్, హరిసేవ్యా నాయక్, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పి.నరసింహారెడ్డి, సబ్‌ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్‌లు ఎం.మధుసూధన్‌రెడ్డి, హుస్సేన్ బాష, డీఈ మోహన్, నాయకులు నరసింహ, ఫయాజ్ బేగ్, పురుషోత్తం, చలపతి, కృష్ణయ్య పాల్గొన్నారు.

ఘనంగా చండీయాగం



చక్రాయపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలేకాంపల్లె గ్రామంలో మావూళ్లమ్మ దేవాలయం ప్రారంభ మహోత్సవం సందర్భంగా రెండో రోజు చండీయాగం నిర్వహించారు. ఆలయ కమిటీ పెద్దలు, గ్రామస్థులు మావూళ్లమ్మ ఆలయాన్ని నిర్మించుకొని మూడురోజులు పాటు హోమాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం పలు హోమాలు చేసి చండీయాగం నిర్వహించారు. అభిషేక పూజలు చేశారు. ఈ హోమానికి ముఖ్యఅతిథిగా మండల టీడీపీ ఇన్‌చార్జి మహేశ్వర్‌రెడ్డిని ఆహ్వానించారు.

రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలి



ధర్నా చేస్తున్న దృశ్యం

కడప సెవెన్ రోడ్స్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పేర్కొన్నారు. కడప రెవెన్యూ డివిజన్ ఆఫీస్ వద్ద బుధవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా, ఏఐటీయూసీ, సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శులురైతు సంఘాల జిల్లా కార్యదర్శులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాల్గొని మాట్లాడారు. ఇప్పటికైనా ఈ కేంద్ర ప్రభుత్వం రైతాంగ కార్మిక వ్యతిరేక విధానాలను మానుకోవాలని, లేకుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

తడిపొడి చెత్తను వేరు చేయాలి

చెన్నూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి) : ఇళ్ల వద్ద ప్రతి మహిళ తడి,పొడి చెత్త వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలని ఈవోఆర్‌డీ సురేశ్‌బాబు అన్నారు. మండలంలోని గుర్రంపాడు పంచాయతీలో ఇంటింటికీ తిరిగి పారిశుధ్యంపై అవగాహన కల్పించడమే కాక హరిత రాయబారులు ఇళ్లవద్దకు వచ్చినప్పుడు వారికి సహకరించాలని అన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ ప్రమీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అంకమ్మ గ్రామోత్సవం

● నేడు నూతన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ

ఎర్రగుంట్ల, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల నడివూరులో నూతనంగా నిర్మించిన మహాఅంకమ్మ (పార్వతీ మాత) ఆలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా బుధవారం వినాయకుడు, అంకమ్మతల్లి, సుబ్రమణ్యస్వామి విగ్రహాల గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం 108 కలశాలు ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. చండీయాగం నిర్వహించారు. 11గంటల నుంచి అంకమ్మ తల్లి గ్రామోత్సవం పురవీధుల గుండా సాగింది. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. వందలాది మంది భక్తులు ముఖ్యంగా మహిళలు అమ్మవారికి కలశ జలంతో అభిషేకం చేసి మొక్కులు తీర్చుకున్నారు. నేడు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, కలశ స్థాపన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సాయంత్రం శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డులో బండలాగుడు కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

మహిళలు హక్కుల కోసం ఉద్యమించాలి

ప్రొద్దుటూరుటౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మహిళలు స్వేచ్ఛా సమానత్వంతో పాటు హక్కుల కోసం ఉద్యమించాలని రాయలసీమ మహిళా శక్తి కార్యదర్శి లక్ష్మీదేవి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సృజన కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలపై రోజు రోజుకు హింస, అత్యాచారాలు పెరిగిపోతున్నాయని, ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ మహాసభ కన్వీనర్ రుక్సానా, అశ్వని, ప్రసన్న, ఉమ, ఆదిత్య, జగదీష, మహమూద్, యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసి గాయపరిచారని ఫిర్యాదు

పోరుమామిళ్ల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పాత గొడవలు మనసులో పెట్టుకుని తనపై గౌసియా మరో ఆరుగురు దాడి చేసి గాయపరిచారని సుందరయ్య కాలనీకి చెందిన రఫీ స్థానిక పోలీసుస్టేషనులో ఫిర్యాదు చేశారన్నారు. గత నెల 28న తాను పనులు చేస్తుండగా గౌసియా మరో ఆరుగురు దాడి చేశారని ఈ సంఘటనలో తమకు ఎడమ కన్నుకు గాయమైందని రఫీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పెండ్యాలకు ఘన నివాళులు

జమ్మలమడుగు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ఆర్టీసీ గ్యారేజీ గేటు వద్ద బుధవారం నేషనల్ మజ్దూర్ యూనియన్ వ్యవస్థాపకుడు పెండ్యాల రామ్మోహన్‌రావు వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి కార్మికులు నివాళులర్పించారు. డిపో కార్యదర్శి శివుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంజీసీవో రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివారెడ్డి, కాంతయ్య, కమిటీ సభ్యులు శ్రీనివాసులు, రామచంద్రుడు, తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో అగ్నిమాపక శాఖ కార్యాలయం

● పిల్లర్స్ దశలో ఆగిపోయిన భవనం



ఫిల్లర్స్ దశలో ఆగిపోయిన భవనం, (ఇన్‌సెట్లో) శిథిలావస్థకు చేరిన అగ్నిమాపక కార్యాలయం

జమ్మలమడుగు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో గల అగ్నిమాపక శాఖ కార్యాలయం శిథిలావస్థకు చేరింది. పురాతన భవనాలు దెబ్బతిన్నాయి. అయినా అదే కార్యాలయంలో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. దీనికి తోడు కార్యాలయానికి ప్రహరీ లేదు. మరుగుదొడ్లు ఇరుకుగా మారి భవనం కడ్డీలు బయటపడి సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వంలో అగ్నిమాపక శాఖ కార్యాలయం నిర్మాణానికి అదే ఆవరణంలో అప్పటి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి శిలాఫలకం వేశారు. కానీ భవనం నిర్మాణానికి నోచుకోలేదు.

జమ్మలమడుగులో అగ్నిమాపక శాఖ కార్యాలయ ఆవరణంలో వైసీపీ ప్రభుత్వం 7.1.2021న శిలాఫలకం వేశారు. కొత్త భవనం నిర్మించేందుకు రూ.86 లక్షలు నిధులతో పనులు ప్రారంభించారు. అప్పట్లో ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా కాంట్రాక్టర్ పనులు మధ్యలోనే ఆపేసినట్లు తెలుస్తోంది. బేస్‌మట్టం, పిల్లర్స్ దశలోనే పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలోనైనా సంబంధిత అధికారులు నూతన భవనం నిర్మిస్తారని పలువురు సిబ్బంది ఎదురుచూస్తున్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు



అరెస్టు చేసిన నిందితులను చూపుతున్న సీఐ

ప్రొద్దుటూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు బైపాసు రోడ్డు పక్కన వున్న సాయిశ్రీ లేఅవుట్ వద్ద గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఆ మేరకు టూటౌన్ సీఐ యుగంధర్ వారి అరెస్టును చూపుతూ వారి వద్ద నుంచి 1100 గ్రాముల గంజాయి, రూ.13 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అరెస్టు అయిన వారిలో గోకుల్ నగర్‌కు చెందిన షేక్ ఖాజా పీర్, దస్తగిరిపేటకు చెందిన పల్లె ప్రశాంతరావు, తలారి మైకేల్‌బాబులు వున్నారు. ప్రశాంత్, మైలేఖ్‌లపై గతంలో మట్కా కేసులు వున్నాయని సీఐ తెలిపారు. వీరిని కోర్టుకు పెట్టగా 14 రోజుల రిమాండ్‌కు తరలించామన్నారు.

దాడి చేశారని ఫిర్యాదు

పోరుమామిళ్ల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కూలి పనికి వెళ్లిన తనపై దాడి చేసి గాయపరిచారని నారిపోగు రాముడు అనే వ్యక్తి స్థానిక పోలీసుస్టేషనులో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. ఆయన బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ కవలకుంట్ల గ్రామానికి చెందిన రాముడు పోరుమామిళ్ల మండలంలోని ఎస్టీ కాలనీలో ఆర్ఎంపీ బాషా స్థలంలో కూలి పనులు చేస్తుండగా సుబ్బరాయుడు మరో నలుగురు తమపై దాడి చేసి గాయపరిచారని ఫిర్యాదు చేశారన్నారు. అలాగే అదే ప్రాంతంలో ఉన్న పెనుబడి వెంకటసుబ్బయ్యను కూడా గాయపర్చారన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

700 బస్తాల బియ్యం స్వాధీనం



గోపవరం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీనివాసపురం సమీపంలో లారీలో అక్రమంగా తరలిస్తున్న 700 రేషన్ బియ్యం బస్తాలను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వారికి రాబడిన సమాచారం మేరకు నిఘా ఉంచి పట్టుకున్నామని, వాటిని సీజ్ చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంటు డీటీ శివశంకర్ తెలిపారు. మైదుకూరు నుంచి చెన్నై వెళుతుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ఆ మేరకు బియ్యం శాంపిల్స్ తీసి ల్యాబ్‌కు పంపించామన్నారు.

మైదుకూరు వైసీపీలో ముసలం

● సమావేశానికి హాజరుకాని మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు
● కానరాని ఖాజీపేట ముఖ్య నాయకులు



విలేకరులతో మాట్లాడుతున్న రవీంద్రనాథ్‌రెడ్డి

మైదుకూరురూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొమ్మిది నెలలు గడవక మునుపే మైదుకూరు వైసీపీలో ముసలం ఏర్పడినట్లు బాహాటంగా కనిపిస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వైసీపీ మొట్టమొదటి సారిగా వైసీపీ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి అధ్యక్షతన, మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి పార్టీ కార్యాలయంలో బుధవారం అనుబంధ సంఘాల నూతన కమిటీ కోసం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి నియోజకవర్గంలోని నాయకులందరూ హాజరుకావాల్సి ఉండగా కొందరు మాత్రమే విచ్చేశారు. ముఖ్యంగా మైదుకూరు మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, కౌన్సిలర్లు సమావేశానికి హాజరు కాలేదు. అంతేకాకుండా ఖాజీపేటకు చెందిన దుగ్గిరెడ్డి గంగాధర్‌రెడ్డి వర్గం కూడా హాజరుకాలేదు. గత కొంత కాలంగా మున్సిపల్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డిల మధ్య సఖ్యత లేదు. ఏదేమైనా వైసీపీ ముఖ్య నాయకులు అనుబంధ నూతన కమిటీ సమావేశానికి రాకపోవడం మైదుకూరులో హాట్‌టాపిక్‌గా నిలిచింది.

సంక్షేమ పథకాల అమలులో విఫలం

సీఎం చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో విఫలమయ్యారని వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి ఎద్దేవా చేశారు. స్థానిక కడప రోడ్డులోని వైసీపీ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ నాయకుల సమావేశం జరిగింది. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డిలు మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో సూపర్ సిక్స్ హామీలు అందిస్తానని మోసగించి ఎన్నికల్లో గెలిచారని మండిపడ్డారు. కార్యక్రమంలో రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, పులి సుబ్బమ్మ, మదీన, దస్తగిరి, శివరాం పాల్గొన్నారు.

కుళాయి కనెక్షన్లను రెగ్యులర్ చేసుకోవాలి



ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న కమిషనర్

బద్వేలు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అక్రమ కుళాయి కనెక్షన్లు ఉన్నవారు తక్షణమే రెగ్యులర్ చేయించుకోవాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని అగ్రహారంలో బ్రహ్మం సాగర్ నుంచి బద్వేలుకు సరఫరా చేయు నీటిని పరిశీలించారు. ఇందులో భాగంగా ఆయన క్లోరిన్ టెస్టులు చేయించి, నీటి వృథా అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలను సూచించారు. అలాగే ఇంటిపన్ను రూ.500లోపు ఉండి పురపాలక పరిధిలోని చిరునామా కలిగి రేషన్‌కార్డు కలిగి ఉంటే రూ.200లకే కుళాయి కనెక్షన్ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్‌తో పాటు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఖాజాహుస్సేన్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ మహేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సర్వీసులను క్రమబద్ధీకరించుకోండి

పోరుమామిళ్ల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సర్వీసులను అనుమతి పొందిన దానికంటే అదనపు లోడు కలిగి ఉంటే స్వచ్ఛందంగా అదనపు లోడు క్రమబద్ధీకరణ చేయించుకోవాలని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రవిచంద్రశేఖర్ తెలిపారు. బుధవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ పోరుమామిళ్ల, కలసపాడు, బి.కోడూరు, కాశినాయన మండల విద్యుత్ వినియోగదారులు మార్చి 1 నుంచి జూన్ 30లోపు ప్రస్తుతం ఉన్న డిపాజిట్ల రేట్లలో 50 శాతం చెల్లించి అదనపు లోడుకు అనుమతి పొందవచ్చన్నారు.

బేటీ బచావో.. బేటీ పడావో ర్యాలీ

జమ్మలమడుగు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో కన్నెలూరు-2, 3 అంగన్వాడీ సెంటర్ల నుంచి బేటీ బచావో బేటీ పడావో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో రాజేశ్వరిదేవి బుధవారం ర్యాలీలో పాల్గొని ప్రసంగించారు. మార్చి 1 నుంచి 8వ తేది వరకు మహిళా దినోత్సవ కార్యక్రమాలు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ గౌషియా, ఏఎన్ఎం సుబ్బరత్నమ్మ, మాబుచాంద్, గంగాదేవి, మహేశ్వరి, ముంతాజ్, రామలక్ష్మి, మాధవి పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ప్రొద్దుటూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణంలోని తిమ్మయ్య కళ్యాణమండపంలో పేకాట ఆడుతున్న మైదుకూరు, ప్రొద్దుటూరుకు చెందిన 11 మందిని అరెస్టు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. వారి నుంచి రూ.1.18 లక్షలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఆక్రమణల తొలగింపునకు ప్రతిపాదనలు

ప్రొద్దుటూరురూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గోపవరం పంచాయతీలో ఉన్న కాలువకట్ట వెంబడి మైలవరం ఉత్తరకాలువపై ఉన్న ఆక్రమణలు తొలగించేందుకు నిధుల మంజూరుకై ప్రతిపాదనలు పంపినట్లు గోపవరం పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ తెలిపారు. కాలువకట్ట మీదుగా ఆక్రమణకు గురైన మైలవరం ఉత్తర కాలువను అభివృద్ధి చేసే ప్రక్రియలో ఆక్రమణలకు పాల్పడిన స్థానికులకు నాలుగు నెలల కిందటే పంచాయతీ అధికారులు నోటీసులు పంపించారు. స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించుకోవాలని అవగాహన కార్యక్రమాలు, ఆటోలలో మైకుల ద్వారా అక్కడి వారిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ వచ్చారు. కాలువపై అక్రమంగా ఏర్పాటు చేసుకున్న ర్యాంపులు, బండలను మంగళవారం అధికారులు జేసీబీతో తొలగించే పనులు చేపట్టారు. కాలువలో పూడికలు, జంబును తొలగించారు. కాలువపై ఉన్న సుమారు కొంత భాగం అక్రమ కట్టడాలను అధికారులు కూలదోయడంతో స్థానికులు అభ్యంతరం తెలిపారు. తమకు ఇంకా సమయం కావాలని కోరారు. దీంతో అధికారులు గత నాలుగు నెలలుగా గడువు ఇచ్చామని, ప్రజలు స్వచ్ఛందంగా తమ తమ ఆక్రమణలను ఎందుకు తొలగించుకోలేదని కార్యదర్శి రామకృష్ణ వారిని ప్రశ్నించారు. ఈ మేరకు మైలవరం ఉత్తర కాలువపై డైమండ్ విల్లాస్ నుంచి గంగమ్మగుడి మీదుగా హ్యాపీహోం వరకు మొత్తం 3.5 కి.మీ. మేర ఆక్రమణలు తొలగించడానికి, పూడికలు తీసివేతకు కావాల్సిన నిధుల మంజూరుకై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ప్రతిపాదనలు పంపామని ఆయన తెలిపారు. నిధులు మంజూరు కాగానే పనులు చేపడుతామని వివరించారు.

ఆశాజనకంగా ఆరుతడి పైర్లు

● హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



పిందె దశలో ఉన్న నువ్వుల పంట

చాపాడు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల పరిధిలో సాగు చేసిన కొర్ర, నువ్వులు వంటి ఆరుతడి పైర్లు ఆశాజనకంగా ఉన్నాయి. గత నెల న్నర రోజుల క్రితం రైతులు ఈ పైర్లను సాగు చేశారు. ప్రస్తుతం పైర్లు పూత, పిందె దశలో ఉండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వెదురూరు, నరహరిపురం, రాజుపాళెం, తిప్పిరెడ్డిపల్లె, విశ్వనాథపురం, చిన్నగురవలూరు, రాజువారిపేట గ్రామాల వద్ద కొర్రపైరు సుమారు మూడు వేల ఎకరాల్లో, నువ్వులు 200 ఎకరాల్లో సాగు చేశారు. వ్యవసాయ పంటల కింద ఈ పైర్లను సాగు చేశారు. ప్రతి ఏడాది ఈ గ్రామాల రైతులు రబీ సీజన్‌లో రెండవ పంట కింద ఆరుతడి పైర్లు సాగు చేస్తున్నారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

బ్రహ్మంగారిమఠం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కాలజ్ఞాన కర్త వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానం పరిధిలోని కనుమ పోలేరమ్మ ఆలయం ప్రాంగణంలో బుధవారం రూ.26 లక్షల దేవస్థానం మిగులు నిధులతో సీసీ రోడ్లు, ఆలయ ప్రాంగణంలో ఫ్లోరింగ్‌కు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్రహ్మంగారిమఠం దేవస్థానం ఫిట్‌పర్సన్ శంకరబాలాజీ మాట్లాడుతూ గతంలో ఆన్‌లైన్‌లో టెండరు పిలిచామని, రూ.27 లక్షలకు ఆన్‌లైన్‌లో టెండరు వేశారని, ఈ మేరకు బుధవారం పనులను ప్రారంభించినట్లు తెలిపారు. అలాగే రాబోవు రోజుల్లో కూడా దేవస్థానం అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని, అలాగే భక్తులు, గ్రామ ప్రజల సహాయ సహకారాలు అందించాలని శంకరబాలాజీ తెలిపారు. రాబోవు రోజుల్లో దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు మెరుగైన సేవలందించేందుకు అభివృద్ధి పనులను దేవస్థానం పరిధిలో చేపడుతున్నామన్నారు.

ఘనంగా ఎంపీజే ఆవిర్భావ దినోత్సవం

ప్రొద్దుటూరుటౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ 20వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.షేక్ సలీం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీజే జిల్లా అధ్యక్షుడు జాకీర్‌ఉమ్రి, పట్టణాధ్యక్షుడు హుస్సేన్‌బాష, ఉపాధ్యక్షుడు నజీర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సాగిన క్రీడా పోటీలు

ప్రొద్దుటూరుటౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఆధ్వర్యంలో వైవీయూఎస్ మున్సిపల్ గర్ల్స్ హైస్కూలులో మహిళా ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా విభాగం అధ్యక్షురాలు జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చూడాలి

కలసపాడు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రతి గ్రామపంచాయతీలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీడీఓ మహబూబ్‌బీ సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్, డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశం ఏర్పాటు చేశారు. పారిశుధ్యం, తాగునీరు, చెత్తసేకరణ సమస్యలు లేకుండా చూసి ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి సర్వేలు పూర్తి చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మురళీమోహన్ పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాల కోసం లబ్ధిదారుల ఎంపిక

చాపాడు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ బ్యాంకు రుణాల కోసం అధికారులు లబ్ధిదారుల లిస్టును తయారు చేశారు. ఎంపీడీవో వీరకిశోర్ బుధవారం చాపాడు, చిన్నగురవలూరు గ్రామాల్లోని యూనియన్ బ్యాంకు, ఏపీజీబీ లకు పేర్లతో కూడిన లిస్టును పంపారు. ప్రభుత్వం మండలానికి బీసీలకు 28 యూనిట్లు, ఈబీసీలకు 5 యూనిట్లు, కాపులకు 6 యూనిట్లు మంజూరు చేసింది. బ్యాంకు అధికారులు లబ్ధిదారులకు రుణాలు ఇచ్చేందుకు మరోసారి కసరత్తు చేస్తున్నారు.

రాయితీకి వ్యవసాయ పరికరాలు

ముద్దనూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా రైతులకు రాయితీతో వ్యవసాయ పరికరాలను అందిస్తున్నదని సద్వినియోగం చేసుకోవాలని ఏవో వెంకటకృష్ణారెడ్డి సూచించారు. మండలానికి 6 బ్యాటరీ స్ప్రేయర్లు, 21 ట్రాక్టర్ పనిముట్లు, 16 పవర్ స్ప్రేయర్లు మంజూరైనట్లు తెలిపారు. గత 5 ఏళ్లలో సబ్సిడీ పరికరాలు పొందని రైతులు అర్హులన్నారు.

రాజుపాలెం: వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద 50 శాతం సబ్సిడీతో రైతులకు ఉపయోగపడే పనిముట్లు అందిస్తున్నట్లు ఏవో ఎస్.శివరామక్రిష్ణారెడ్డి తెలిపారు. ఇందులో పవర్ స్ప్రేయర్లు, మాన్యువల్ ఆపరేట్ స్ప్రేయర్లు, ట్రాక్టరు ఆపరేట్ స్ప్రేయర్లు, వ్యవసాయ పనిముట్లు రోటామీట్లు అందిస్తున్నట్లు తెలిపారు.

రహదారి భూముల పరిశీలన

పోరుమామిళ్ల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతుల వివరాలను తహసీల్దారు చంద్రశేఖరరెడ్డి సేకరించారు. వారు ఎంత కోల్పోయారు, విస్తీర్ణాలకు సంబంధించి ఆరాతీశారు. బుధవారం ఆయన ఆరు లైన్ల, నాలుగు లైన్ల రహదారికి సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. బొప్పాపురం తదితర ప్రాంతాల్లో తిరిగి రైతులను విచారించారు.

అభివృద్ధికి కృషి చేయాలి

ప్రొద్దుటూరుటౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధికి కమిటీ అధ్యక్షుడు డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి కృషి చేయాలని శ్రీకృష్ణాలయం యాదవ సేవా సంఘం సభ్యులు పేర్కొన్నారు. జిల్లా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యునిగా ఎన్నికైన డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డిని వారు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షుడు రామసుబ్బరాయుడు యాదవ్ మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి వెంకటరమణయాదవ్, కోశాధికారి వెంకటయ్యయాదవ్, శ్రీనివాసులు, రవిశంకర్, పెద్దపుల్లయ్య, సుబ్బరాయుడు, శ్రీనివాసులు, రామ్మోహన్, రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

'క్రీస్తుమార్గం ఆదర్శం'

ప్రొద్దుటూరుటౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): క్రీస్తు మార్గం ఆదర్శమని ఫాదర్ రెవరెండ్ కోలాటిరాజు పేర్కొన్నారు. బుధవారం గోకుల్‌నగర్ ఎస్పీజీ-2 చర్చిలో బుధవారం ఉపవాస ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవులు తమ పాపాలను తొలగించమని యేసుక్రీస్తును ప్రార్థించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు పాల్గొన్నారు.